# కరీంనగర్ వార్త

కరీంనగర్ - జగిత్యాల - పెద్దపల్లి - రాజన్నసిరిసిల్ల

శనివారం 31, జనవరి 2026 | 16 పేజీలు





## మున్సిపల్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

నోడల్ ఆఫీసర్లు , స్పెషల్ ఆఫీసర్లు కేటాయించిన విధులను సమర్ధవంతంగా నిర్వహించాలి..

జనరల్ అబ్జర్వర్ ఖర్టాడే కాళీచరణ్ సుదామా రావు



# చట్టాలకు తూట్లు.. కన్నాల గుట్టకు పోట్లు

## రాయల్టీ ఎగవేస్తూ అక్రమార్కుల కోట్లు

పెద్దపల్లి, ప్రభాతవార్త: పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ధర్మారం ఎక్స్ రోడ్ సమీపంలో గల కన్నాల బోడగుట్ట అక్రమార్కుల చేతిలో కనుమరుగవుతోంది. గత మూడు దశాబ్దాలుగా ప్రభుత్వ నిబంధనలను బేఖాతర్ చేస్తూ, కొంతమంది క్వారీ నిర్వాహకులు మైనింగ్ శాఖ అధికారులతో కుమ్మక్కై సాగిస్తున్న అక్రమ దందా ఇప్పుడు పతాక స్థాయికి చేరింది. నెలకు లక్షల రూపాయల 'మామూళ్లు' ముట్టజెబుతూ, నిబంధనలకు విరుద్ధంగా కొండలను పిండి చేస్తూ కోట్ల రూపాయలు గడిస్తున్నారు.



2 లో..

అనుమతులు గోరంతా.. అక్రమాలు కొండంత

కనుమరుగవుతున్న కన్నాల బోడగుట్ట

మామూళ్ల మత్తులో మైనింగ్ శాఖ.. అర్ధరాత్రి పేలుళ్లతో వణుకుతున్న కన్నాల

ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు నిర్వాహకులు రాత్రి 11 గంటల నుండి తెల్లవారుజామున 5:30 గంటల వరకు భారీ కాంప్రెషర్ ట్రాక్టర్లతో క్వారీలకు రంధ్రాలు చేస్తూ, జిలెటిన్ స్టిక్స్‌తో భారీ పేలుళ్లు (బ్లాస్టింగ్) నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా, గ్రామ పంచాయతీకి పైసా రాయల్టీ కట్టకుండా సాగిస్తున్న ఈ దందాపై మైనింగ్ అధికారులు కన్నెత్తి కూడా చూడకపోవడం వెనుక పెద్ద ఎత్తున ముడుపుల హస్తం ఉందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

### పంట పొలాల్లో రాళ్ల వర్షం.. రైతుల ఆవేదన

క్వారీ పరిసరాల్లో ఉన్న వ్యవసాయ భూములే లక్ష్యంగా ఈ పేలుళ్లు సాగుతున్నాయి. బ్లాస్టింగ్ సమయంలో పెద్ద ఎత్తున బండరాళ్లు పంట పొలాల్లో పడుతుండటంతో సాగు చేస్తున్న రైతులు ప్రాణభయంతో వణికిపోతున్నారు. పంట నష్టంపై నిలదీస్తే.."అన్నీ పర్మిషన్లు ఉన్నాయి, పేలుళ్లు అన్నప్పుడు రాళ్లు పడక తప్పదు" అంటూ బాధ్యతారాహిత్యంగా సమాధానం చెబుతున్నారు. కొంతమంది భూ నిర్వాసితులకు అరకొర నష్టపరిహారం ఇచ్చి నోళ్లు నొక్కేస్తున్నారని, అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



2 లో..

వ్యూహ ప్రతివ్యూహాలతో ముందుకు సాగుతున్న స్వపక్ష, విపక్ష నేతలు

కోరుట్ల బరిలో పెద్ద ఎత్తున యువత

మున్సిపల్‌పై జెండా ఎగురవేస్తామంటున్న కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నేతలు

కాంగ్రెస్, బీజేపీకి రెబల్స్ బెడద

# రసవత్తరంగా కోరుట్ల రాజకీయం

**కోరుట్ల, ప్రభాతవార్త**

ఎన్నికల సంఘం మున్సిపల్ ఎన్నికలు ఖరారు చేస్తూ నామినేషన్‌ల గడువు ప్రచార తేదీలు ప్రకటించడంలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున నామినేషన్‌లు దాఖలు చేయడంతో కోరుట్లలో రాజకీయం రసవత్తరంగా మారింది. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో భాగంగా స్వపక్ష, విపక్ష నేతలు వ్యూహ, ప్రతివ్యూహాలతో పావులు కదుపుతున్నారు. ఎన్నడూ లేని విధంగా ఈ సారి పురపాలక ఎన్నికల్లో ఆసక్తి సంతరించుకుంది. గత 9న్నర సంవత్సరాల పాటూ బీఆర్ఎస్ అధికారంలో ఉండడంతో కోరుట్లలో



2 లో..

కాంగ్రెస్ బిఆర్ఎస్ రెండూ ఒకటే

రాష్ట్రాన్ని దోచుకుంటున్నారు

బిఆర్ఎస్ ప్రభుత్వంలో రాష్ట్రం అప్పులపాలు

బిఆర్ఎస్ పార్టీ మునిగి పోయే నావా

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చాలి

బిఆర్ఎస్ నాయకులను జైల్లో పెడతాను అన్న సీఎం రేవంత్ మాటలు ఏమైనాయి

బిజెపి కార్యకర్తలు సైనికుల వాలే పనిచేయాలి

మున్సిపల్ ఎన్నికలలో అత్యధిక స్థానాలు సాధించాలి

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామ చంద్రరావు

# తెలంగాణ రాష్ట్రాన్ని దోచుకుంటున్నారు

**జగిత్యాల బ్యూరో, ప్రభాతవార్త**

కాంగ్రెస్, బిఆర్ఎస్ రెండు పార్టీలు ఒకటేనని బిఆర్ఎస్ రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని, కాంగ్రెస్ మాయమాటలతో ప్రజలను మోసం చేస్తున్నారని బి జె పి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు పేర్కొన్నారు ..జగిత్యాల జిల్లా కేంద్రం లో ని ఓ ఫంక్షన్ హాల్ లో శుక్రవారం బీజేపీ మున్సిపల్ విజయ శంఖరావం బహిరంగ సభను నిర్వహించారు. భారతీయ జనతా పార్టీ శుక్రవారం మున్సిపల్ ఎన్నికల విజయ శంఖారావం

## చట్టాలకు తూట్లు.. కన్నాల గుట్టకు పోట్లు

(మొదటి పేజీ తరువాయి..)

**అర్ధరాత్రి వేళ మృత్యుఘోష !**

అదేవిధంగా గతంలో కొన్ని సందర్భాల్లో ఎలాంటి శిక్షణ లేని వ్యక్తులచే బ్లాస్టింగ్‌లు చేపట్టిన సమయంలో క్వారీ కార్మికులు ప్రమాదంలో గాయపడి కాళ్లు, చేతులు పోయాయని, అంతేగాకుండా కొన్ని సందర్భాల్లో కొంత మంది ప్రాణాలు కొల్పోయారని, అధికారుల అండదండలతో బాధితుల బంధువులకు నామ మాత్రపు నష్టపరిహారం ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల డిమాండ్**

నాటి నుండి నేటి వరకు ప్రకృతి సహజ సంపదను దోచుకుంటున్న నిర్వాహకుల నుంచి ప్రభుత్వానికి వచ్చే రాయల్టీ వసూలు చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులచే ఆడిట్ చేయించి ప్రభుత్వ ఆదాయం చేకూరేలా



చూడాలని, అదేవిధంగా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ, పర్యావరణాన్ని నాశనం చేస్తున్న కార్వీ నిర్వాహకులపై, మామూళ్లు వసూలు చేస్తూ క్వారీ నిర్వాహకులకు వత్తాసు పలుకుతున్న అధికారులపై చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని కన్నాల, జిడినగర్ గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ అక్రమ బ్లాస్టింగ్‌లను అరికట్టాలని కోరుతున్నారు.



## రసవత్తరంగా కోరుట్ల రాజకీయం

(మొదటి పేజీ తరువాయి..)

కాంగ్రెస్ పార్టీ క్యాడర్ లేక కష్టాల్లో కూరుకుపోగా, కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు తిరుమల గంగాధర్ పార్టీని తన భుజస్కందాలపై వేసుకొని నడిపించాడు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో నుండి దిగిపోయి కాంగ్రెస్ పార్టీ అధికారం రావడంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహంతో ముందుకు రావడం, బీఆర్ఎస్ పార్టీలో అప్పటి చైర్మెన్, కౌన్సిలర్లలంతా ముకుమ్మాడీగా కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో ఒక్కసారిగా కాంగ్రెస్ పార్టీ పుంజుకోవడంతో కాంగ్రెస్ పార్టీ మళ్లీ పటిష్టంగా మారడం, బీఆర్ఎస్ పార్టీలో క్యాడర్ లేక ఇబ్బందులు పడుతూ వస్తుంది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఇటీవల సర్పంచ్ ఎన్నికలు నిర్వహించడం ఈ ఎన్నికల్లో కోరుట్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ తన బలాన్ని నిరూపించుకొని మెజార్టీ సర్పంచ్ స్థానాలు కైవసం చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం కౌన్సిలర్ ఎన్నికలను నిర్వాహణ ప్రకటించడంతో పల్లెల్లో సాధించిన విధంగా కోరుట్ల మున్సిపల్‌లో సైతం కాంగ్రెస్ పార్టీ చక్రం తిప్పాలని కంకణం కట్టుకుంది. కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ జువ్వాడి నర్సింగరావు సారథ్యంలో కోరుట్ల మున్సిపల్ కౌన్సిలర్ల టికెట్లు కేటాయింపు జరిగింది. టికెట్ల కేటాయింపు విషయంలో కొంత తర్జనభర్జన జరిగినా, టికెట్లు రానివారికి నామినేటెడ్ పదవులు అప్పగిస్తామని హామి ఇవ్వడంతో కొంత సమస్య సద్దుమనిణినప్పటికి కొన్ని వార్డుల్లో రెబల్స్ బెడద ఉండనుంది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సుమారు 21సీట్లు గెలిచి జెండా ఎగురవేయబోతున్నామని కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జీ జువ్వాడి నర్సింగరావు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్‌లో ఉన్న కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో బీఆర్ఎస్ మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు లేక కొంత ఇబ్బంది పడినప్పటికీ కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ తన స్వంత వ్యూహాలతో పార్టీలో కొత్త క్యాడర్‌ను చేర్చుకొని అన్ని వార్డుల్లో తమ అభ్యర్థులను పోటీలో ఉంచారు. ఈ ఎన్నికల్లో తాము యువతను ఎన్నుకొని బరిలో ఉంచబోతున్నామని, మరోమారు సైతం బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ ఎన్నికల్లో అత్యధిక సీట్లు సాధించి మున్సిపల్‌పై తమ జెండా నిలబెడుతామని కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపుతున్నారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ పార్టీ ప్రజల్లోకి చేరడంతో ఈ సారి మున్సిపల్ ఎన్నికల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి తమ బలాన్ని నిరూపించుకునే ప్రయత్నంలో ఉంది. నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు అరవింద్ ధర్మపురి నాయకత్వంలో పార్టీ క్యాడర్ బలంగా మారడం, ఇటీవల కోరుట్లకు చెందిన ప్రముఖ వ్యాపార వేత్తలు అనూప్‌రావు, అల్లాడి ప్రవీణ్‌ల నేతృత్వంలో బీజేపీ అభ్యర్థుల ఎంపికలో అచూతుచి వ్యవహరించడం గెలుపు గుర్రాలకే సీట్లు కేటాయింపులు చేసి ఈ సారి మున్సిపల్‌పై బీజేపీ జెండా పాతబోతున్నట్లు బహిరంగంగానే చెబుతున్నారు. ఏది ఏమైనప్పటికీ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ నాయకుల ఎత్తుగడలతో ఈ సారి ఎన్నికల పండుగ కోరుట్లలో జోరుగానే సాగేటట్లు కనబడుతుంది.

**కోరుట్ల బరిలో పెద్ద ఎత్తున యువత**

ఈ సారి మున్సిపల్ ఎన్నికల్లో పెద్ద ఎత్తున యువత పోటీల్లో నిలిచి, నామినేషన్‌లు దాఖలు చేశారు. కాంప్రగెస్ పార్టీలో మాజీ చైర్మెన్, కౌన్సిలర్లు ఉండడంతో పాత క్యాడర్‌కు అవకాశం కల్పించారు. ప్రధానంగా బీజేపీ, బీఆర్ఎస్‌లో కొత్త నాయకత్వానికి, యువతకు ఎక్కువగా అవకాశం ఇవ్వడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. కోరుట్లలోని 33 వార్డుల్లో అన్ని పార్టీలను కలుపుకొని సుమారు 20మంది వరకు యువత పోటీల్లో ఉండనున్నారు.

**ఈ సారి మొత్తం నామినేషన్‌లు 337**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో భాగంగా కోరుట్లలోని 33వార్డులకు గానూ అన్ని పార్టీలను కలుపుకొని 193 మంది అభ్యర్థులు మొత్తం 337 వరకు నామినేషన్‌లు దాఖలు అయ్యాయి. కాంగ్రెస్ పార్టీ 98, బీఆర్ఎస్ పార్టీ 75, బీజేపీ పార్టీ 67, ఎంఐఎం పార్టీ 22, స్వతంత్రులు 57, ఇతరులు 16, సీపీఐ పార్టీ 2 నామినేషన్‌లు దాఖలు చేశారు.

## మున్సిపల్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

**జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:**

మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా నోడల్ అధికారులకు మరియు ప్రత్యేక అధికారులకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని జనరల్ అబ్జర్వర్ ఖర్టాడే కాళీచరణ్ సుదామారావు పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జనరల్ అబ్జర్వర్ ఖర్టాడే కాళీచరణ్ సుదామా రావు ముఖ్య అతిథిగా పాల్గొని జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మరియు ఎక్స్పెండీచర్ అబ్జర్వర్ డి. శ్రీనివాస్ లతో పాల్గొని రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై జిల్లా నోడల్ అధికారులు, స్పెషల్ ఆఫీసర్లు మరియు మున్సిపల్ కమిషనర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జనరల్ అబ్జర్వర్ ఖర్టాడే కాళీచరణ్ సుదామా రావు మాట్లాడుతూఎన్నికల ప్రవర్తన నియమావళికి లోబడి మున్సిపల్ ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లు జరుగకుండా పగడ్బందీగా ఎన్నికలు నిర్వహించుటకు నోడల్ అధికారుల, స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్ లు మరియు ఇతర ఎన్నికలకు కేటాయించిన అధికారులందరు సమన్వయంతో క్షేత్ర స్థాయిలో కలిసి పని చేసి మన జిల్లాలో ఎన్నికలు స్వేచ్ఛాయుత మరియు పారదర్శకంగా జరిగే విధంగా అందరు కలిసి పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలంటే నోడల్ అధికారుల, స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్ లు మరియు ఇతర ఎన్నికలకు కేటాయించిన అధికారులందరు నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో నామినేషన్ల చాలా ముఖ్యమైన అంశమని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి అంశం నిబంధనల ప్రకారం జరిగేలా చూడాలని తెలిపారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, అప్పీళ్ళ పరిష్కారం, గుర్తుల కేటాయింపు, ఎన్నికల్లో పోటీచేయు అభ్యర్థులు అనుమతులను తీసుకోవాలంటే సంబంధిత అధికారులను సంప్రదించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల పరిశీలన, పోలింగ్ కేంద్రాల వద్ద సౌకర్యాల వంటివి అన్నికూడా సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయి పరిశీలన చేసి అధికారులతో సమన్వయం చేసుకొని అన్ని పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్, అడిషనల్ ఎస్పీ శేషాద్రిని రెడ్డి ఐపిఎస్, జిల్లా నోడల్ అధికారులు, స్పెషల్ ఆఫీసర్లు, మరియు మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్రాన్ని దోచుకుంటున్నారు

(మొదటి పేజీ తరువాయి..)

బహిరంగ సభను కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రాంచందర్ రావు ,నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు అర్వింద్ ధర్మపురి , పార్టీలో మాజీ పార్లమెంట్ సభ్యులు బోర్లకుంట వెంకటేష్ నేత ,జిల్లా అధ్యక్షులు రాంచకొండ యాదగిరి బాబు తో కలసి పాల్గొన్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వైదురాలు బోగ శ్రావణి పాల్గొన్నారుఈ సందర్భంగా జగిత్యాల్ జిల్లా ప్రముఖ వ్యాపారవేత్త కొండా అరుణ లక్ష్మణ్ ఆరుముళ్ల హరి పుప్పాల శ్రీనివాస్ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు, నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు అరవింద్ ధర్మపురి సమక్షంలో డాక్టర్ శ్రావణి ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీలో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు మాట్లాడుతూబిజెపి పార్టీ దేశం ధర్మం కోసం దేశాభివృద్ధి కోసం పోరాడుతుందని ఇతర పార్టీలు అవినీతి చేయడంతో పాటు డబ్బు సంపాదన ద్వేయంగా పనిచేస్తున్నాయని పేర్కొన్నారుసీఎం రేవంత్ బాషా బాగా లేదు ప్రభుత్వం వచ్చాక టిఆర్ఎస్ నాయకులను జైల్లో పెడతానని మాట ఇచ్చి రెండు సంవత్సరాలు గడిచిపోయిన ఒక్క నిమిషం కూడా జైల్లో పెట్టకపోవడం ఆశ్చర్యంగా ఉందని పేర్కొన్నారు.ఫోన్ టాపింగ్ లో నోటీసు ఇస్తూ విచారణ చేయడం తప్ప ఎవరిపై చర్యలు తీసుకోవడం లేదని ఎన్ని రోజులు సాగనంపుతారో తెలియడం లేదని పేర్కొన్నారునోటు కు ఓటు కేసు లో నన్ను నువ్వు రక్షించవు నేను నిన్ను రక్షిస్తాను అంటూ సీఎం రేవంత్, కెసిఆర్ లోపయాకరి ఒప్పందం చేసుకున్నారని పేర్కొన్నారుబి ఆర్ ఎస్, కాంగ్రెస్ పార్టీ లు బొగ్గు కుంభకోణం లో ఉన్నాయి అని పేర్కొన్నారుబ్రతుకులు బాగు పడాలంటే బీజేపీ కి ఓటు వేయండి బిజెపితోనే దేశ అభివృద్ధి తో పాటు అవినీతిని అంతం చేసే పార్టీ ఒక బీజేపీ మాత్రమేనని పేర్కొన్నారుటిఆర్ఎస్ పార్టీ మునిగిపోతున్న పడవ అని ఆ పార్టీ నుండి పోటీ చేయడానికి అభ్యర్థులు దొరకడం లేదని పేర్కొన్నారుఎంపీ, ఎమ్మెల్సీ, సర్పంచ్ ఎన్నికల్లో బి ఆర్ ఎస్ పార్టీ ని ప్రజలు తిరస్కరించారు అన్నారు దోచుకున్న సొమ్ము లో కొట్లాట వచ్చింది అని కెసిఆర్ కూతురు చెప్తుంది కవిత అనే బి ఆర్ ఎస్ పార్టీ అవినీతిని బయటపడుతుందని ఎంత అవినీతి జరిగిందో తెలంగాణ ప్రజలు గుర్తించాలని పేర్కొన్నారు బీజేపీ ని మున్సిపల్ ఎన్నికల్లో గెలిపించండి. మోడీ సహకారం తో జగిత్యాల రాయికల్ లోని 62 వార్డులను గెలిపిస్తే ప్రధాని నరేంద్ర మోడీతో మాట్లాడి ఈ రెండు మున్సిపాలిటీలు ఎంతో అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారునిజామాబాదు ఎంపీ అరవింద్ మాట్లాడుతూజగిత్యాల లో అంత చిక్కుముడి ఉంది రాంచందర్ రావు అన్న మీరే తెల్చాలి అన్నారు మీ ఎమ్మెల్యే సంజయ్ ఏ పార్టీ లో ఉన్నాడు నాకు అయితే తెలియదు మీరే చెప్పాలి అన్నారు ..నాలుగో తేదీన తొండల (సీఎం ) జగిత్యాల కి వస్తున్నాడంట కదా అతనిని అడిగి చెప్పండి అని పేర్కొన్నారుసీఎం రేవంత్ తమ్ముడు కొండల్ రెడ్డి, ముఖ్యమంత్రి తొండల్ రెడ్డి రాష్టంలో ఎలాంటి పాలన జరుగుతుందో ప్రజలు చూస్తున్నారని పేర్కొన్నారు.ఎమ్మెల్యే సంజయ్ మున్సిపల్ ఎన్నికల్లో ఏ పార్టీ కి ఓటు వేయుమని అడుగుతాడు వేచి చూడాలన్నారు ..పార్టీ మారుతాను అంటే జీవన్ రెడ్డి ని తీస్కొని పార్టీ అంటూ ఏది ఉండదు ప్రతి పార్టీ వారి జీవన్ రెడ్డిని ఆహ్వానిస్తారని పేర్కొన్నారు. ..ఎంతో అనుభవం ఉన్న జీవన్ రెడ్డి గాంధీ భవన్ దగ్గర గోస పడుతున్నాడు టికెట్లు అడుక్కునే పరిస్థితి ఎందుకు వచ్చిందని పేర్కొన్నారు ..జీవన్ రెడ్డి, నేను మా పార్టీల కు కార్యకర్తలము దళారులం కాదు పార్టీ కోసం నిజాయితీ పని చేసే వాళ్ళమని పేర్కొన్నారుజగిత్యాల లో బీజేపీ కి ఓటు వేయండి అవినీతిని దూరం చేసి అభివృద్ధికి పట్టం కట్టాలని పేర్కొన్నారుసీఎం రేవంత్ రెడ్డి కి చీము నెత్తురు లేదు ఏదో మాట్లాడుతాడు ఏదో చెప్పాడు రాష్ట్రాన్ని ఏం చేస్తాడో తెలియడం లేదన్నారు ..నిన్ను జైల్లో వేసాడు నీకు సిగ్గు లేదా రేవంత్ అరెస్ట్ చేయవా ఇంకా ఎన్నిరోజులు కాలనీ అప్పన చేస్తావు అని పేర్కొన్నారు ..సీఎం రేవంత్ జగిత్యాల ఎమ్మెల్యే ఏ పార్టీ లో ఉన్నడో చెప్తే అందరికీ బాగుంటుందని పేర్కొన్నారు ..సీఎం రేవంత్ మాటి మాటికీ మ నాన్న పటేల్, తాత పటేల్ ఎక్కడ పోయింది ని పౌరుషం ఎప్పుడు మాజీ సీఎం కేసీఆర్ ను అరెస్ట్ చేస్తావని జైల్లో రూము కట్టిస్తానని మాయమాటలు చెప్పి ఇంతవరకు ఒకరిని కూడా టిఆర్ఎస్ నాయకులను జైల్లో పెట్టకపోవడం మీకు సరి కాదని పేర్కొన్నారుపెద్దపల్లి మాజీ ఎంపీ వెంకటేష్ నేత మాట్లాడుతూరాష్ట్రంలో బిజెపి పార్టీకి అవకాశం ఇవ్వాలని దేశాభివృద్ధి కోసం పనిచేస్తున్న పార్టీ ఒక బీజేపీ మాత్రమేనని పేర్కొన్నారు దేశాభివృద్ధి ధర్మం కోసం పోరాడే పార్టీకి అందరూ మద్దతు తెలిపి మున్సిపల్ లో పోటీ చేసే అభ్యర్థులను గెలిపించాలని పేర్కొన్నారు ..బీజేపీ నాయకులు భోగ శ్రావణి మాట్లాడుతూఎమ్మెల్యే సంజయ్ గెలిచిన, ఓడిన అధికారం లో ఉన్న పార్టీ లో నే ఉన్నాడు పదవులు వాళ్లే డబ్బు సంపాదించేయంగా ఉన్నాడని పేర్కొన్నారుఎమ్మెల్యే సంజయ్ ఏ పార్టీ లో ఉన్నాడు ప్రజలకు తెలపాలని పేర్కొన్నారుఎమ్మెల్యే సంజయ్ చెప్పు మున్సిపల్ ఎన్నికల్లో ఏ పార్టీ అని చెప్పి ఓటు అడుగుతావు ప్రజలను మోసం చేయడానికి ఏ పార్టీ అని చెప్పుకుంటామని పేర్కొన్నారు ఈ సమావేశంలో బిజెపి నాయకులు కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు

# ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ జిల్లా కమిటీలో ఎస్టీలకు ప్రాతినిధ్యం కల్పించాలి

## అంబేద్కర్ యువజన సంఘం డిమాండ్

పెద్దపల్లి, ప్రభాతవార్త:

జిల్లా స్థాయిలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న డిస్ట్రిక్ట్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుల నియామకంలో పారదర్శకత లోపించిందని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఆరోపించింది. ఈ నియామక ప్రక్రియలో ఎస్టీ సామాజిక వర్గానికి తగిన ప్రాధాన్యత ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశారని పేర్కొంటూ శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. జిల్లా కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో కలెక్టరేట్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ బండి ప్రకాష్‌కు, అలాగే జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారికి తమ ఫిర్యాదును అందజేశారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ నియమ నిబంధనల ప్రకారం జిల్లా స్థాయి కమిటీలో అన్ని వర్గాలకు సమాన ప్రాతినిధ్యం ఉండాలని, కానీ ప్రస్తుత ఎంపికలో అది పాటించలేదని నాయకులు విమర్శించారు. డీవీఎంసీ సభ్యులుగా ఇద్దరు మాల, ఇద్దరు మాదిగ, ఒక నేతకాని కులానికి చెందిన వ్యక్తిని ఎంపిక చేసిన



అధికారులు, ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన వారికి కనీస చోటు కల్పించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలోని ఎస్టీ కులాల నుండి కూడా తక్షణమే సభ్యులను నియమించాలని, లేనిపక్షంలో ఈ విషయాన్ని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకువెళ్తామని స్పష్టం చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షులు మామిడిపల్లి బాపయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు, రాష్ట్ర ఉపాధ్యక్షులు మైన రాజేష్, డీవీఎంసీ మాజీ సభ్యులు కొంకటి లింగమూర్తి తదితరులు ఉన్నారు.

# ముగిసిన నామినేషన్ల గడువు

## 201 మంది అభ్యర్థులు.. 339 నామినేషన్లు

పెద్దపల్లి, ప్రభాతవార్త:

పెద్దపల్లి మున్సిపాలిటీకి జరగనున్న రెండో సాధారణ ఎన్నికల ప్రక్రియలో కీలక ఘట్టమైన నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం ముగిసింది. ఈ నెల 28 నుండి 30వ తేదీ వరకు మూడు రోజుల వ్యవధిలో మొత్తం 201 మంది అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను సమర్పించినట్లు మున్సిపల్ కమిషనర్, ఎన్నికల అధికారి ఆకుల వెంకటేష్ తెలిపారు. అభ్యర్థులు వేర్వేరు సెట్ల వారీగా మొత్తం 339 నామినేషన్ పత్రాలను దాఖలు చేశారని ఆయన పేర్కొన్నారు. మున్సిపాలిటీలోని 36 వార్డులకు గాను భారీ సంఖ్యలో అభ్యర్థులు బరిలో నిలిచారు. ప్రధానంగా 7వ వార్డు నుండి అత్యధికంగా 9 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా, 11, 14, 10 వార్డుల్లో కూడా అభ్యర్థుల తాకిడి ఎక్కువగా కనిపించింది. మిగిలిన వార్డుల నుండి కూడా అభ్యర్థులు ఉత్సాహంగా నామినేషన్లు సమర్పించారు. గడువు ముగియడంతో ఇకపై నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియపై అధికారులు దృష్టి సారించనున్నారు. పట్టణంలో ఎన్నికల వాతావరణం వేడెక్కడంతో రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు తమ తదుపరి వ్యూహాల్లో నిమగ్నమయ్యారు

# మృతుని ఇంటికే మరణ ధృవీకరణ పత్రం

ఓదెల, ప్రభాతవార్త:





ఓదెల మండల కేంద్రంలోని ఓదెల గ్రామంలో మరణించిన గుండవేన. ఎల్లయ్య,శాతల్ల భూమక్క,దాసరి కిష్టస్వామి కుటుంబ సభ్యులకు మరణ ధృవీకరణ పత్రం అందజేసిన సర్పంచ్ సతీష్ ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మరణించిన నిరుపేద కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని అదేవిధంగా వారికి ఎల్లవేళల కృషి చేస్తానని అన్నారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోపతి శ్రీలత ప్రవీణ్, వార్డ్ సభ్యులు అప్పని తిరుపతి,దూలం సదానందం,రాపెల్లి రాజయ్య, కొండ్ర. లక్ష్మణ్ బుద్దే. తిరుమల రవి తోపాటు తదితరులు మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

# మగ్గిడి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సస్పెండ్

ధర్మపురి, ప్రభాతవార్త:

ధర్మపురి మండలం,మగ్గిడిలోని తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కదారి పద్మను సస్పెండ్ చేస్తూ పాఠశాల విద్య సంచాలకులు ఉత్తర్వులు విడుదల చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ పద్మ తన విధులను నిర్వర్తించే విషయంలో నిర్లక్ష్యం వహించారని,విద్యార్థులను వేధించడమే కాకుండా ఎస్సెస్సీ విద్యార్థులకు స్టడీ అవర్స్ నిర్వహించడం లేదని, పాఠశాల పరిపాలనను పర్యవేక్షించడంలో విఫలమయ్యారని అధికారుల దృష్టికి రావడంతో అధికారులు విచారణ జరిపారు. దాంతో క్రమశిక్షణా చర్యలు చేపట్టాలని విద్యా సంచాలకులు మరియు ఎక్స్ అఫీషియో, మోడల్ స్కూల్స్ ప్రాజెక్ట్ డైరెక్టర్, తెలంగాణ, హైదరాబాద్ వారు, ప్రిన్సిపాల్ పద్మను సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు.అలాగే ఆరోపణలకు సంబంధించిన క్రమశిక్షణా విచారణ ప్రక్రియ ముగిసే వరకు ఆమె సస్పెన్షన్‌లోనే కొనసాగుతారని సస్పెండ్ లేఖ లో పేర్కొన్నారు.

# మంటల్లో చిక్కి కాలిపోయిన వ్యక్తి మృతి

చిగురుమామిడి, ప్రభాత వార్త:

చిగురుమామిడి మండల కేంద్రానికి చెందిన పొన్నం ఆగయ్య (80) అను వ్యక్తి గురువారం రోజున జరిగిన అగ్ని ప్రమాదం లో పూర్తిగా కాలిపోయి మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు ఆగయ్య వృద్ధాప్యం కారణం చేత గత ఆరేడు సంవత్సరంల నుండి ఇంటి వద్దనే ఉంటున్నాడు. అతని భార్య కనకవ్వ కరీంనగర్లో కూరగాయలు అమ్ముతూ కుటుంబాన్ని పోషించేది. గురువారం రోజు మృతుడి భార్య కనకవ్వ కూరగాయలు అమ్ముటకు కరీంనగర్ వెళ్ళినది. ఆగయ్య ఒక్కడే తమ ఇంటిలోని గదిలో పడుకున్నాడు. పక్క గదిలో ఆగయ్య కొడుకు సమ్మయ్య పడుకున్నాడు. అర్ధ రాత్రి సమయంలో ఆగయ్య మూలుగు వినిపించగా అతని కొడుకు సమ్మయ్య మెలకువ వచ్చి లేచి వెళ్లి ఆగయ్య పడుకున్న గది తలుపు తట్టగా, లోపలి నుండి గడియ పెట్టి ఉన్నది. సమ్మయ్య కిటికీలో నుండి చూడగా ఆగయ్య కు నిప్పంటుకొని మండుచున్నాడు. సమ్మయ్య వెంటనే చుట్టుపక్కల వారిని లేపి గడ్డపారతో బలవంతంగా తలుపు తెరిచి చూసేసరికి ఆగయ్య పూర్తిగా కాలిపోయి మరణించి ఉన్నాడు. ఆగయ్యకు బీడీలు తాగే అలవాటు ఉన్న కారణంగా రాత్రి అతను బీడీ త్రాగుటకు అగ్గిపుల్ల గీసి బీడీ అంటించుకునే క్రమంలో ప్రమాదవశాత్తు మండుతున్న అగ్గిపుల్ల తన మంచంపై గల వస్త్రం పై పడి నిప్పంటుకొని అట్టి మంటలు ఆగయ్యకు అంటుకొని శరీరం పూర్తిగా కాలి చనిపోయినారని తెలిపారు. మృతుడి కొడుకు సమ్మయ్య ఇచ్చిన దరఖాస్తు పై కేసు నమోదు చేసి పరిశోధన చేయబడుతున్నట్లు ఏ ఎస్సై వీర తిరుపతి తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఇద్దరు కూతురులు ఉన్నట్లు ఏ ఎస్సై తెలిపారు. మృతుడి కాలిపోయిన మృత దేహ దృశ్యం చూసిన స్థానికులు జాలి తో కుటుంబ సభ్యులను ఓదార్చారు.

# ఉరి వేసుకొని యువకుడి మృతి

## మృతుడు మున్సిపల్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల నర్సు హన్మాండ్లు కుమారుడు

మెట్‌పల్లి,ప్రభాతవార్త:



పట్టణంలోని దుబ్బవాడకు చెందిన మున్సిపల్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల నర్సు హన్మాండ్లు కుమారుడు వంశీ (37) హైదరాబాద్లో శుక్రవారం ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.వంశీ గచ్చిబౌలిలో భార్య,ఇద్దరు పిల్లలతో నివాసం ఉంటూ,సాఫ్ట్ వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు.కాగా మృతుడి తండ్రి హన్మాండ్లు యాదవ్ మెట్పల్లి మున్సిపల్ కౌన్సిలర్ అభ్యర్థిగా గురువారం నామినేషన్ దాఖలు చేయగా..మృతుడి కుటుంబ సభ్యుల్లో విషాదం నెలకొంది. వంశీ మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

# నేరాలు-దారుణాలు

# చెక్‌పోస్ట్ వాహనాల తనిఖీలో...

## - 20 లక్షల నగదు పట్టుకున్న పోలీసులు

సిరిసిల్ల బ్యూరో, జనవరి 30, ప్రభాతవార్త :



మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీలో పెద్ద మొత్తంలో నగదు పట్టుబడింది. శుక్రవారం సిరిసిల్ల రగుడు జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టి చెక్‌పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీలు చేస్తుండగా 20 లక్షల రూపాయల నగదు పట్టుకున్నట్లు పట్టణ సిఐ కృష్ణ తెలిపారు. టిజి 23ఎ 1524 అనే కారును పోలీసులు తనిఖీ చేయగా వేములవాడకు చెందిన గణాచారి సంబాషిన్ అనే వ్యక్తి వద్ద అనుమానాస్పదంగా కనిపిస్తున్న 20 లక్షల నగదు తీసుకెళ్ళడం గుర్తించినట్లు ఆయన తెలిపారు. ఎన్నికల నిబంధలన ప్రకారం ఆ నగదును ఎస్ఎస్‌టి బృంద ఇంచార్జి జి ఆనంద్, ఎపిఓ సమక్షంలో, మధ్యవర్తుల సమక్షంలో ఆ నగదును స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఈ నగదును ఎక్కడకు తీసుకెళుతున్నారనే విషయాన్ని విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. ఎన్నికల నామినేషన్ల స్వీకరణ జరుగుతున్న తరుణంలో లక్షలాది రూపాయలు పట్టుకోవడం కలకలం రేపింది. ఎవరైన యాబై వేల రూపాయలకు మించి డబ్బును తీసుకెళితే ఆధారాలు చూపించాలని లేని పక్షంలో ఆ డబ్బును సీజ్ చేయడం జరుగుతుందని పోలీసులు తెలిపారు.

# ఉరి వేసుకుని వ్యక్తి మృతి

గంగాధర,ప్రభాత వార్త:

గంగాధర మండలం పోతుగంటిపల్లి గ్రామానికి చెందిన కదారి మల్లారెడ్డి వయసు (85) మానసికంగా వేదనపడుతూ ఒంటరితనంతో కుమిలిపోతూ తన చిన్న కొడుకు ఇంట్లో శుక్రవారం ఉదయం దూలానికి ధోతితో ఉరి పెట్టుకుని మరణించాడు ఒంటరితనం భరించలేకనే తన తండ్రి ఉరి పెట్టుకొని మరణించడని కొడుకు శ్రీనివాస్ రెడ్డి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గంగాధర ఎస్సై బి వంశీకృష్ణ తెలిపారు.

# ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం

చొప్పదండి ప్రభాతవార్త:



చొప్పదండి పట్టణంలోని 12 వ వార్డు కి చెందిన బొడిగెవెంకన్న ఇల్లు ప్రమాదవశాత్తు దగ్ధం అయింది. ఆయనకుటుంబంతో కలిసి చొప్పదండి లోని సమ్మక్క సారక్క జాతరకు వెళ్లగా మధ్యాహ్నం 12 గంటల సమయంలో తాళం వేసి ఉన్న ఇంటి లోపల మంటలు అంటుకొని ఇల్లంతా వ్యాపించగా చుట్టుపక్కల వారు వచ్చి అతనికి తెలిపి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు.స్థానిక పోలీసులు, కరీంనగర్ నుండి అగ్నిమాపక వాహనం పిలిపించి తర్వాత మంటలు పూర్తిగా అర్పించారు.బాధితుడు వెంకన్న పిర్యాదు మేరకు కేస్ నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నరేష్ రెడ్డి తెలిపారు విద్యుత్ షాక్ వల్ల జరిగిందా గ్యాస్ సిలిండర్ వల్ల జరిగిందా అనేది తేయవలసి ఉందని పేర్కొన్నారు.

# కల్వచర్ల ప్రభుత్వ పాఠశాలలో చోరీకి యత్నం

రామగిరి, ప్రభాతవార్త:

రామగిరి మండలంలోని కల్వచర్ల ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం చోరీకి యత్నాం జరిగింది. గ్రామంలోని పాఠశాల ఆవరణలో తాళం వేసి ఉన్నా స్టోర్ రూం తాళాలను పగలగొట్టిన వ్యక్తులు స్టోర్ లోకి ప్రవేశించారు. స్టోర్ లో ఏమి లభ్యం కాకపోవడంతో వస్తువులను చిందర వందర చేశారు. సీఎం స్థాయి మండల కప్ పోటీలు జరగనున్న నేపథ్యంలో పోటీలకు సంబంధించిన వస్తువులు లభిస్తాయనే ఉద్దేశ్యంతోనే చోరికి యత్నించినట్లు తెల్సింది. పాఠశాల ప్రాంగణంలో అడుకోవడానికి వచ్చిన పిల్లలను చూసిన వ్యక్తులు పరారైనట్లు తెల్సింది. చిల్లర దొంగల పనిగా స్థానికులు బావిస్తున్నారు.




# కాంగ్రెస్ నాయకులు భయ బ్రాంతులకు గురి చేయడం సరికాదు

## కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

**కోరుట్ల, ప్రభాతవార్త :**



అధికారం ఉంది కదా అని పెత్తనం చెలాయిస్తే ఊరుకోబోమని, కాంగ్రెస్ నాయకుల బెదిరింపులకు బిఆర్ఎస్ కార్యకర్తలు భయపడబోరని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల మాట్లాడుతూ కోరుట్లలో ఇటీవల బీఆర్ఎస్ లో చేరిన నాయకులను నామినేషన్ వేయకుండా కాంగ్రెస్ నాయకులు అడ్డుకోవడం, బెదిరింపులకు గురి చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. రాజకీయాల్లో హుందాగా మెలగాలని, అధికారం చేతిలో ఉందని భయభ్రాంతులకు గురి చేస్తే సహించేది లేదని ఎమ్మెల్యే హెచ్చరించారు. బీఆర్ఎస్ లో చేరితే కేసులు పెడతామని వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో ఏనాడు ఇలాంటి చౌకబారు రాజకీయాలు చేయలేదని, అధికారం శాశ్వతం కాదని అహంకారపూరితంగా వ్యవహరిస్తే ప్రజలే తగిన బుద్ధిచెబుతారన్నారు. బీఆర్ఎస్ లో యువతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, కొత్త తరానికి రాజకీయాల్లో మంచి భవిష్యత్తు ఉందన్నారు. రాజ్యాంగం ఉంది, కోర్టులు ఉన్నాయి, హుందాగా వ్యవహరించాలి తప్ప రాజకీయాలను భ్రష్టు పట్టించవద్దని హితవు పలికారు. యువత భవిష్యత్తుకు దిక్సూచి అని రాజకీయాలకు కొత్త తరాన్ని పరిచయం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. కోరుట్ల మున్సిపల్ ఎన్నికల్లో యువతరానికి అధిక సీట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. కేంద్ర ఆర్థిక సర్వే కాళేశ్వరం ప్రాజెక్టుతో రాష్ట్రంలో 89 లక్షల ఎకరాలు కొత్తగా సాగులోకి వచ్చాయని తెలిపిన విషయాన్ని ఎమ్మెల్యే ప్రస్తావించారు. కేసీఆర్ పాలనలో కాంగ్రెస్ నాయకుల అబద్దాలను పటాపంచలు చేస్తూ సర్వే పార్లమెంట్ సాక్షి గా రాష్ట్ర ప్రగతిపై ప్రశంసలు కురిపించిందని చెప్పారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, సీనియర్ నాయకులు సింగిరెడ్డి నారాయణరెడ్డి, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు చీటి వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

## కోరుట్ల బీఆర్ఎస్‌లో చేరికలు

**కోరుట్ల, ప్రభాతవార్త :**



పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 8వ వార్డుకు చెందిన 20 మంది కాంగ్రెస్ నాయకులు శుక్రవారం కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరికి గులాబీ కండువాలు కప్పిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదిహేనేళ్లుగా పార్టీలో పని చేసిన కాంగ్రెస్ పార్టీలో గుర్తింపు లేదని, బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధికి ఆకర్షితమై బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని, అందరికీ సముచిత గౌరవం, అవకాశం కల్పిస్తామని బరోసా కల్పించారు. బీఆర్ఎస్ పార్టీలో చేరేందుకు యువత ఉత్సాహం చూపుతున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కొత్త తరం రాజకీయాల్లోకి రావడం శుభ పరిణామమన్నారు. బీఆర్ఎస్ లో అన్ని వర్గాలకు సమప్రాధాన్యం ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సింగిరెడ్డి నారాయణ రెడ్డి, గడ్డం మధు, స్వామి, నవీన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా స్వశక్తి భవనాలకునిధుల మంజూరు

**మేడిపెల్లి, ప్రభాతవార్త :**

మండలం లోని పలు గ్రామాల్లో గల మహిళా స్వశక్తి సంఘాల భవనాల నిర్మాణానికి రూ. 1కోటి 30 లక్షల నిధులు మంజూరు చేసిన ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ కు మేడిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏనుగు రమేష్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రెస్ మీట్లో వారు మాట్లాడుతూ మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ నిధులుమంజూరు చేసి ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వానికిముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోని మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్నారన్నారు. మండలంలోని వల్లంపల్లి కొండాపూర్, కల్వకోట, పోరుమల్ల విలయతాబాద్, కట్లకుంట మాచపూర్, దమ్మన్నపేట, గుండ్లపల్లి గ్రామాలకు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి చేపూరి నాగరాజు, ఎస్సీ సెల్ అధ్యక్షులు మేదరి లాజర్, సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు గుగ్గిళ్ళ రమేష్, సర్పంచ్లు వేముల లింబాద్రి, సట్ట భూమేష్, రోజా నాగరాజు, సంజన, శ్రీనివాస్, మాజీ సర్పంచులు బొంగోని రాజా గౌడ్, వెలమ నవీన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ దాసరి శంకర్, సీనియర్ నాయకులు ఉరుమడ్ల నర్సయ్య, మార్గం నర్సారెడ్డి, మరిపెల్లి స్వామి గౌడ్, దప్పు ప్రేమ్ సాగర్, జంగిలి నరేష్, అంకం ప్రభాకర్, దేశెట్టి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన గోవిందారం పాఠశాల విద్యార్థి నవదీప్

**భీమారం, ప్రభాతవార్త :**



భీమారం మండలం గోవిందారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి పిట్టల నవదీప్ జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక కావడం పాఠశాలకు, గ్రామానికి గర్వ కారణంగా నిలిచింది. నిజామాబాద్ జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలలో నవదీప్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. గ్రామీణ స్థాయిలో చదువుకుంటూ జాతీయ స్థాయికి చేరుకోవచ్చని నవదీప్ తన క్రీడా ప్రదర్శనతో నిరూపించాడని ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆస్ఫాక్ హుస్సేన్ తెలిపారు. జాతీయస్థాయిలోనూ మెరుగైన ప్రదర్శనతో పాఠశాల ఖ్యాతిని పెంపొందించాలని ఆకాంక్షి ంచారు. నవదీప్ ప్రతిభకు మెలకువగా శిక్షణ అందించిన ఫిజికల్ డైరెక్టర్ ప్రశాంత్‌ను పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా ప్రశంసించింది. నవదీప్ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బిలాస్పూర్‌లో ఫిబ్రవరి 4వ తేదీ నుంచి జరగనున్న జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొననున్నాడని ఫిజికల్ డైరెక్టర్ ప్రశాంత్ వెల్లడించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సర్పంచ్ పుల్లూరి ఉమారాణి దేవయ్య, ఎపీసీ చైర్మన్ పాటి లావణ్య నారాయణ, ఉపసర్పంచ్ బింగి స్వామి, గ్రామ ప్రజలు విద్యార్థి నవదీప్‌ను ఘనంగా అభినందించారు.

## పల్లగుట్ట దేవాలయాల నిర్మాణానికి రూ. 1లక్ష 51 వేల విరాళం

**భీమారం, ప్రభాతవార్త :**



భీమారం మండలంలోని మన్నెగూడెం గ్రామ పరిధిలో పల్లగుట్టపై ప్రతిష్టాత్మకంగా నిర్మాణంలో ఉన్న దేవాలయాల కోసం గ్రామానికి చెందిన భూపెల్లి రాజారెడ్డి భార్య లక్షి ్మ, మహేష్ భార్య నందిని, రంజిత్ భార్య స్వాతి మొత్తం రూ.1 లక్ష 51వేలు విరాళంగా అందజేశారు. ఈ విరాళాన్ని మన్నెగూడెం పల్లగుట్ట దేవాలయాల కమిటీ సభ్యులకు ఆలయాల నిర్మాణ కార్యక్రమాల నిమిత్తం అందించారు. ఈ సందర్భంగా గ్రామంలో భక్తి భావం, సేవా దృక్పథం ప్రతిబింబించేలా తమ వంతు సహకారం అందించిన దాతలను గ్రామ ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు. పల్లగుట్టపై నిర్మాణం అవుతున్న దేవాలయాలు గ్రామానికి ఆధ్యాత్మిక ప్రశాంతత, ఐక్యతను తీసుకురావాలని ఆకాంక్షి ంచారు. పల్లగుట్టపై నిర్మించబడుతున్న దేవాలయాల దేవతల కరుణాకటాక్షాలు దాతలపై, గ్రామ ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని గ్రామ ప్రజలు, దేవాలయాల కమిటీ సభ్యులు మనస్ఫూర్తిగా ఆకాంక్షి ంచారు. సత్యారావు, కొండ కిషన్ గౌడ్, సూర్య మెడికల్ రమేష్, కోమటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్మెంట్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

### టి జి యు ఎస్ జిల్లా అధ్యక్షులు నునావత్ రాజు డిమాండ్

**కోరుట్ల, ప్రభాతవార్త :**

రిటైర్మెంట్ పొందుతున్న ఉపాధ్యాయులకు ప్రభుత్వం వెంటనే న్యాయం చేయాలని, డీఏ, పీఆర్సీ, అలాగే రిటైర్మెంట్ బకాయిలను తక్షణమే చెల్లించాలని టీ జీ యు ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు నునావత్ రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కోరుట్ల మండలంలో జడ్ పి హెచ్ ఎస్ ఏకిన్ పూర్ పాఠశాలలో నిర్వహించిన ఉపాధ్యాయుడు జుంబర్తి శంకర్ పదవీవిరమణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఏళ్ల తరబడి విద్యారంగానికి సేవలందించిన ఉపాధ్యాయులు పదవీవిరమణ సమయంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనడం దురదృష్టకరమన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్సీ అమలు, ఇతర రిటైర్మెంట్ బకాయిలను ప్రభుత్వం ఆలస్యం చేయకుండా చెల్లించాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. అధ్యక్షులు మార్గం రాజేంద్ర ప్రసాద్, కోరుట్ల, కథలాపూర్, మేడిపల్లి మండలాల విద్యాధికారులు నరేశం, శ్రీనివాస్, లక్షి ్మ నారాయణలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, తెలంగాణ ప్రాంతీయ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు ప్రసాద్ రావు, ప్రధాన కార్యదర్శి రాజేష్, రాష్ట్ర నాయకులు బోనగిరి దేవయ్య, సిరిపురం రాజేష్, దీపక్లు తదితరులు పాల్గొన్నారు.



## బార్ కౌన్సిల్ ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకున్న కోరుట్ల బార్ అసోసియేషన్ సభ్యులు

**కోరుట్ల టౌన్, ప్రభాతవార్త :**



తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికలలో కోరుట్ల బార్ అసోసియేషన్ సభ్యులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారని పోలింగ్ ఆఫీసర్ బైరి విజయ్ కుమార్, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్స్ చాప కిషోర్, సుతారి నవీన్ కుమార్ తెలిపారు. శుక్రవారం కోరుట్ల బార్ అసోసియేషన్ పోలింగ్ ఆఫీసర్ బైరి విజయ్ కుమార్, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్స్ చాప కిషోర్, సుతారి నవీన్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికలలో కోరుట్ల బార్ అసోసియేషన్ సభ్యులు 98 మంది సభ్యుల్లో 92 ఓట్లు పోలయ్యాయని, 06 ఓట్లు పోలుకాలేదని వివరించారు. ప్రశాంతమైన వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా విజయవంతంగా నిర్వహించగలిగినందుకు సహకారం అందించిన కోరుట్ల బార్ అసోసియేషన్ సభ్యులందరికీ పోలింగ్ ఆఫీసర్ బైరి విజయ్ కుమార్, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్స్ చాప కిషోర్, సుతారి నవీన్ కుమార్ ధన్యవాదాలు తెలిపారు.

# రామగుండం కార్పొరేషన్ ఎన్నికలలో ఆర్జీ 1మాజీ జీఎం పోటీ

### 43వ డివిజన్‌లో బీఆర్ఎస్ బలప్రదర్శన

### కల్వల నారాయణ నామినేషన్‌తో వేడెక్కిన రామగుండం ఎన్నికలు





**గోదావరిఖని ,ప్రభాతవార్త:** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు రోజురోజుకీ ఆసక్తికర మలుపులు తిరుగుతున్నాయి. బీఆర్ఎస్ పార్టీ తరఫున 43వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థిగా సింగరేణి ఆర్జీ-1 ప్రాంత మాజీ జనరల్ మేనేజర్ కల్వల నారాయణ నామినేషన్ దాఖలు చేయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. సింగరేణి నేపథ్యం, పరిపాలనా అనుభవంతో పాటు బలమైన నాయకత్వ లక్షణాలు ఉన్న వ్యక్తి రంగప్రవేశం చేయడంతో ఎన్నికల పోటీ తీవ్రత పెరిగింది.

**భారీ ఊరేగింపుతో నామినేషన్ దాఖలు**

కల్వల నారాయణ నామినేషన్ కార్యక్రమం బీఆర్ఎస్ శ్రేణుల శక్తిని చాటే విధంగా సాగింది. మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ సమక్షంలో నామినేషన్ దాఖలు చేయగా, పార్టీ నాయకులు, కార్యకర్తలు, సింగరేణి కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నినాదాలు, జెండాలు, బ్యానర్లతో పట్టణం బీఆర్ఎస్ మయంగా కనిపించింది. ఈ దృశ్యాలు 43వ డివిజన్‌లో బీఆర్ఎస్ బలాన్ని స్పష్టంగా తెలియజేశాయని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

**సింగరేణి అనుభవమే ప్రధాన అస్త్రం**

సింగరేణి సంస్థలో కీలక బాధ్యతలు నిర్వహించిన కల్వల నారాయణకు కార్మిక సమస్యలు, పట్టణ మౌలిక వసతులపై లోతైన అవగాహన ఉంది. ఉద్యోగుల సంక్షేమం, ప్రజా సమస్యల పరిష్కారంలో అనుభవం ఆయనకు ప్రజల్లో విశ్వసనీయతను పెంచిందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా గోదావరిఖని-రామగుండం ప్రాంతంలో సింగరేణి ఉద్యోగులు కీలక ఓటు బ్యాంకుగా ఉండటంతో, ఈ అంశం బీఆర్ఎస్‌కు అనుకూలంగా మారే అవకాశముందని అంచనా వేస్తున్నారు.

**మేయర్ అభ్యర్థి ఆయనేనా?**

రాజకీయ వర్గాల్లో చర్చల్వల నారాయణ నామినేషన్‌తో పాటు మరో ఆసక్తికర అంశం తెరపైకి వచ్చింది. బీఆర్ఎస్ మేయర్ అభ్యర్థిగా ఆయన పేరును పార్టీ అధిష్ఠానం పరిశీలిస్తోందా? అన్న ప్రశ్న రాజకీయ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మద్దతు, పార్టీ కీలక నేతల సమక్షంలో నామినేషన్ జరగడం ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూర్చింది. అయితే దీనిపై పార్టీ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

**రసకందాయంలోకి రామగుండం కార్పొరేషన్ ఎన్నికలు**

ఇప్పటికే ప్రధాన రాజకీయ పార్టీల మధ్య గట్టి పోటీ నెలకొన్న నేపథ్యంలో, కల్వల నారాయణ అభ్యర్థిత్వం ఎన్నికలకు కొత్త ఊపునిచ్చింది. అభివృద్ధి, పరిపాలన అనుభవం, కార్మిక వర్గ మద్దతు వంటి అంశాలు రానున్న రోజుల్లో కీలకంగా మారనున్నాయి. మొత్తంగా రామగుండం కార్పొరేషన్ ఎన్నికలు రసకందాయంలోకి ప్రవేశించాయని, చివరి నిమిషం వరకు రాజకీయ ఉత్కంఠ కొనసాగనుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ముగిసిన నామినేషన్ల పర్వం

- 28 వార్డులకు 260 నామినేషన్లు
- నేడు నామినేషన్ల పరిశీలన.. 3న విత్ డ్రా

**వేములవాడ, ప్రభాతవార్త:**



వేములవాడ మున్సిపల్ ఎన్నికల్లో కీలక ఘట్టమైన నామినేషన్ల పర్వం శుక్రవారంతో ముగిసింది. నామినేషన్ల చివరి రోజు కాంగ్రెస్ 47, బిజెపి 37, బీఆర్ఎస్ 43, ఇండిపెండెంట్ 21, జనసేన 3, సిపిఐ 1, ఎఐఎస్ఎఫ్ 3తో మొత్తం 154 నామినేషన్లు దాఖలు అయ్యాయి. మొదటి రోజు 16, రెండో రోజు 90, మూడో రోజు 154తో 260 నామినేషన్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. మూడు రోజులుగా నామినేషన్ల పర్వం హోరాహోరీగా సాగింది. మొదటి రోజు స్వల్పంగా నామినేషన్లు వచ్చిన రెండో రోజు భారీ సంఖ్యలో రాగా చివరి రోజు అత్యధిక సంఖ్యలో నామినేషన్లు వచ్చాయి. ఒక్కో పార్టీ నుంచి ఇద్దరు, ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు వేశారు. పార్టీలు నామినేషన్ల చివరి రోజు వరకు అభ్యర్థులను ప్రకటించకపోవడంతో సీటు వస్తుందన్న ధీమాతో నామినేషన్లు వేశారు. కొందరికి టికెట్ రాదని తెలియడంతో పార్టీలు మారారు. 25వ వార్డు నుంచి కాంగ్రెస్ పార్టీలో ఉన్న గూడూరి మధులక్ష్మి బిఆర్ఎస్ పార్టీలో చల్మెడ లక్ష్మీనరసింహ రావు ఆధ్వర్యంలో చేరి నామినేషన్ వేశారు. 23వ వార్డులో బిజెపిలో ఉన్న బోనాల శివ సాగరిక వారం క్రితం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆ వార్డు నుంచి టికెట్ ఆశించగా వేరే అభ్యర్థికి కేటాయించడంతో అతను తిరిగి మళ్లీ బిజెపిలోకి చేరి నామినేషన్ వేశారు. కాంగ్రెస్ పార్టీలో టికెట్లు ఆశించి భంగపడ్డ అభ్యర్థులు ఇతర పార్టీల వైపు మొగ్గు చూపుతున్నారు. టికెట్ రాని వారు కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పోరాడాలని నిర్ణయించుకొని నేడు నామినేషన్ల పరిశీలన ఉంటుంది. 3వ తేదీన నామినేషన్ల విత్ డ్రాలు ఉంటాయి. ప్రధాన పార్టీల నుంచి బలమైన అభ్యర్థులు నామినేషన్ వేయడంతో త్రిముఖ పోటీ ఉండే అవకాశాలున్నాయి.

# ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

### లలితమాత ఆలయ ఫౌండర్ ట్రస్ట్ చైర్మన్ చెల్లం స్వరూప

**జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త:**



భక్తిభావం,ఆధ్యాత్మిక చింతన ద్వారానే ప్రతి ఒక్కరికీ మానసిక ప్రశాంతత లభిస్తుందని పొలాస లలితమాత ఆలయ ఫౌండర్ ట్రస్ట్ చైర్మన్ చెల్లం స్వరూప అన్నారు.జగిత్యాల పట్టణం లోని పలు దేవాలయాల్లో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు.జగిత్యాల పట్టణ సమీపంలోని శ్రీ సూర్య ధన్వంతరి ఆలయం,పొలాసలోని లలితామాత ఆలయాల్లో శుక్రవారం పర్వదినాన్ని పురస్కరించుకుని సుహాసినీలు పెద్ద సంఖ్యలో కుంకుమ పూజలు నిర్వహించారు. చింతకుంటలోని ధన్వంతరి ఆలయంలో శ్రీ ధనలక్ష్మి సేవా సమితి ఆధ్వర్యంలో లలితా సహస్రనామ పారాయణం, అమ్మవారికి ఒడిబియ్యం సమర్పణ కార్యక్రమాలు జరిగాయి.ఈ సందర్భంగా నిర్వహించిన లక్కీ డిప్ ద్వారా ఎంపికైన భక్తురాలికి అమ్మవారి శేష వస్త్రాన్ని బహుకరించి సత్కరించారు.అనంతరం జగిత్యాల రూరల్ పొలాసలోని లలితమాత ఆలయంలో చెల్లం స్వరూప ఆధ్వర్యంలో మహిళలు శ్రీచక్రాలకు కుంకుమ పూజలు నిర్వహించి,అన్నప్రసాద వితరణ చేశారు.మరోవైపు,ప్రసిద్ధ సహస్ర లింగాల దేవాలయ 11వ వార్షికోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఉత్సవ మూర్తులకు నిర్వహించిన పంచామృతాభిషేకంలో భక్తులు భారీగా పాల్గొన్నారు.ఈ వార్షికోత్సవ వేడుకలు శనివారంతో ముగియనున్నట్లు ఆలయ నిర్వాహకులు నలమాస గంగాధర్ తెలిపారు.ఈ కార్యక్రమములో పొలాస ఆలయ ఫౌండర్ ట్రస్ట్ చైర్మన్ చెల్లం సత్తయ్య,చెట్ల జానకి,వొడ్న శ్రీనివాస్,వడ్లగట్ట రాజన్న ఉటూరి కళ్యాణి,హరిత,ఉటూరి అర్చన,వనజ, మహేందర్,అర్చకులు అజయ్,లత,శ్వేత ఉపారాణి,రమ్య,స్మిత రాణి,భీమేశ్వరి,యశోద, గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మా గాంధీ వర్ధంతి

**రామగిరి, ప్రభాతవార్త:**



మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం కమాన్‌పూర్ మండల కేంద్రంలోని అంగడి బజార్‌లో గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కమాన్‌పూర్ గ్రామ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్, ఉప సర్పంచ్ రఫిక్ సోహెల్, మాజీ మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు ఎండీ ముస్తాక్, హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షులు నారపల్లి సతీష్ గౌడ్, వార్డు సభ్యులు మేరుగు కుమార్, నాయకులు నగునూరి నర్సయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు గాంధీజీ దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు.

## గనులలో మెరుగైన రక్షణ చర్యలు చేపట్టాలి

### టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు నాగేల్లి సాంబయ్య



**రామగిరి, ప్రభాతవార్త:** గనులలో కార్మికుల భద్రతకు పెద్దపీట వేయాలని, పని స్థలాల్లో మెరుగైన రక్షణ చర్యలు చేపట్టాలని టీబీజీకేఎస్ రామగుండం ఆర్జీ3 ఉపాధ్యక్షుడు నాగేల్లి సాంబయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఓసీపీ 1 గనిలో జరిగిన ప్రమాదంలో గాయపడిన ఫిట్టర్ అభిలాష్‌ను ఆయన పరామర్శించారు. గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి వెళ్లి బాధితుడిని కలిసిన సాంబయ్య, ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధితుడికి అందుతున్న వైద్య సౌకర్యాల గురించి వైద్యులతో చర్చించారు. అభిలాష్ త్వరగా కోలుకునేలా మెరుగైన వైద్యం అందించాలని ఆయన వైద్యులకు సూచించారు. దీనిపై వైద్యులు స్పందిస్తూ.. ప్రస్తుతం బాధితుడి కాలుపై వాపు ఎక్కువగా ఉన్నందున శస్త్రచికిత్సకు కొంత ఆలస్యం అవుతోందని, వాపు తగ్గేందుకు ప్రత్యేక వైద్యం అందిస్తున్నామని తెలిపారు. మరో రెండు మూడు రోజుల్లో శస్త్రచికిత్స నిర్వహిస్తామని వివరించారు. ఈ సందర్భంగా బాధితుడు అభిలాష్‌కు ధైర్యం చెప్పిన సాంబయ్య, యూనియన్ తరఫున అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. గనుల్లో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు రక్షణ చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన కోరారు. ఈ పరామర్శ కార్యక్రమంలో ఓసీపీ1 ఫిట్ సెక్రటరీ గిటుకు శ్రీనివాస్, బేస్ వర్క్ షాప్ ఫిట్ సెక్రటరీ భోగం పూర్ణాకర్, అసిస్టెంట్ సెక్రటరీ కొండ్ల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## జెండా మోసిన కార్యకర్తలను గెలిపించాలి

### మాజీ మంత్రి జీవన్ రెడ్డి

**జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:**



జరగబోయే మున్సిపల్ ఎన్నికలలో జెండా మోసిన కార్యకర్తలను గెలిపించాలని మాజీ మంత్రి జీవన్ రెడ్డి పేర్కొన్నారు.జగిత్యాల పట్టణంలో మున్సిపల్ ఎన్నికలలో పలు వార్డులలో కౌన్సిలర్ గా నామినేషన్ వేస్తున్న సందర్భంగా శుక్రవారం అభ్యర్థులు మాజీ మంత్రి జీవన్ రెడ్డి ని మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది...ఈ సందర్భంగా మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి మాట్లాడుతూ...దశాబ్దాల కాలం నుండి జండా మోసిన కాంగ్రెస్ పార్టీ నాయకులను గెలిపించాలని పిలుపునిచ్చారుప్రభుత్వం వచ్చింది అని అధికారం కోసం అవకాశ వాదులు వస్తున్నారు ఊసరవెల్లి లాగా రంగులు మారుస్తున్నారు జాగ్రత్త వారిని తరిమికొట్టాలి అని అన్నారుగతంలో జరిగిన తప్పిదాలు మళ్ళీ జరగకూడదు అని అన్నారునేను మీ వెంట ఉంటా అవకాశ వాదులను వదిలే సమస్య లేదు అన్నారు. మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి పేర్కొన్నారు..

# భారీ మెజారిటీతో బిజెపి అభ్యర్థుల గెలుపు ఖాయం

### బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ రఘు



**మెట్ పల్లి టౌన్, ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీకి చెందిన మున్సిపల్ ఎన్నికల అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలవబోతున్నారని, మున్సిపల్ చైర్మన్ స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంటుందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ రఘు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని పలు వార్డులకు చెందిన బీజేపీ అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసే ముందు బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ రఘును కలిశారు. ఈ సందర్భంగా వారికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాల వద్ద బీజేపీ అభ్యర్థులు కలువగా వారికి ఆల్ ది బెస్ట్ చెప్పారు. అనంతరం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే తమ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తాయని అన్నారు. ప్రస్తుత మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు విజయం సాధించి చైర్మన్ స్థానాన్ని కైవసం చేసుకుని మున్సిపల్ లో బీజేపీ జెండాను ఎగరేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎన్నికల ఇంచార్జీ అమ్మాపూర్ రాజేష్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు బొడ్ల రమేష్, స్టేట్ కౌన్సిల్ మెంబర్ ఏలేటి నరేందర్ రెడ్డి, బొడ్ల ఆనంద్, కొయ్యల లక్ష్మణ్, న్యాయవాది బద్దం గంగాధర్, నాయకులు బొడ్ల అనిల్, ముక్క నరేష్, జెట్టి సతీష్, భోగ త్రిలోక్, జెట్టి రూపేష్ తదితరులు పాల్గొన్నారు.

## మెట్‌పల్లి వార్త

# రక్తదానం చేసిన పంచాయతీ కార్యదర్శి

**ఇబ్రహీంపట్నం, ప్రభాతవార్త :** మండలంలోని గోదూర్ గ్రామానికి చెందిన పంచాయతీ కార్యదర్శి గురుడు శ్రీకాంత్ రక్తదానం చేశారు. ఉద్యోగ రీత్యా మండలంలోని వేముల కుర్తి గ్రామంలో పంచాయతీ కార్యదర్శి గా విధులు నిర్వహిస్తున్న శ్రీకాంత్ మల్లాపూర్ మండలం సిర్పూర్ గ్రామానికి చెందిన రేగుల లక్ష్మి అను మహిళకు అత్యవసర చికిత్స నిమిత్తం ఓ పాజిటివ్ రక్తం అవసరం కాగా సమాచారం తెలుసుకున్న శ్రీకాంత్ బ్లడ్ బ్యాంక్ కు వెళ్లి ఓ పాజిటివ్ రక్తం ఇచ్చాడు. దీంతో అతను రక్తదానం ప్లేట్లెట్స్ దానం చేయడం ఇది 49 సారి అని తెలిపాడు. రక్తం అవసరం ఉన్నదని తెలువగానే హైదరాబాద్, కరీంనగర్, నిజామాబాద్, జగిత్యాల, మెట్పల్లి ప్రాంతాల్లోని బ్లడ్ బ్యాంక్ కి వెళ్లి రక్తం దానం చేస్తూ ఉంటాడు. ప్రభుత్వ ఉద్యోగ విధులు నిర్వహిస్తూ సేవా భావంతో రక్తదానం చేయడం పట్ల ఆయనను పలువురు అభినందించారు.



# నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

### అదనపు ఎస్పీ శేషాద్రిని రెడ్డి.




**మెట్ పల్లి,ప్రభాత వార్త:** మున్సిపల్ ఎన్నికల సందర్భంగా నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా అదనపు ఎస్పీ శేషాద్రిని రెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో నామినేషన్ల దాఖలుకు చివరి రోజు కావడంతో మెట్ పల్లి మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను అదనపు ఎస్పీ శేషాద్రిని రెడ్డి శుక్రవారం క్షేత్రస్థాయిలో సందర్శించారు.ఇందులో భాగంగా నామినేషన్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను ఆమె పర్యవేక్షించారు.ఈసందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ..నామినేషన్ కేంద్రాల పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని, అభ్యర్థులు, వారి అనుచరులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా పాటించాలని, నిబంధనలకు విరుద్ధంగా, శాంతిభద్రతల విఘాతానికి ప్రయత్నించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.అదనపు ఎస్పీ వెంట డీఎస్పీ రాములు,సీఐ అనిల్ కుమార్,ఎస్.ఐ కిరణ్ కుమార్ లు ఉన్నారు.

# పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

### మండల విద్యాధికారి మధు.



**ఇబ్రహీంపట్నం, ప్రభాతవార్త :** పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని మండల విద్యాధికారి మధు అన్నారు. ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆంగ్ల ఉపాధ్యాయులకు అలాగే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గోదూర్ లో హిందీ ఉపాధ్యాయులకు పాఠశాల సముదాయ సమావేశాలు జరిగాయి. సమావేశాన్ని ఉద్దేశించి మండల విద్యాధికారి బండారి మధు మాట్లాడుతు ఈ పాఠశాల సముదాయం లను సద్వినియోగం చేసుకొని ఇక్కడ చర్చించినటువంటి వినూత్నమైన పద్ధతులను మీ మీ పాఠశాలలో ఇంప్లిమెంట్ చేయాలన్నారు. అదేవిధంగా ఎల్ఐపి కి సంబంధించిన మిడ్లైన్ టెస్ట్ ఆధారంగా విద్యార్థులందరూ ఎండ్ లైన్ టెస్ట్ వరకు పురోగతి సాధించే విధంగా చూడగలరని, పదవ తరగతి లో 100 ఉత్తీర్ణత వచ్చే విధంగా విద్యార్థులను సన్నద్ధం చేయాలని కోరారు. ఇందులో రిసోర్స్ పర్సన్స్, సి ఆర్ పి లు రవీందర్, శివరాం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన ఎన్నికల వ్యయ పరిశీలకులు

**మెట్ పల్లి టౌన్,ప్రభాతవార్త:**



మున్సిపల్ రెండవ సాధారణ ఎన్నికల నేపథ్యంలో జగిత్యాల జిల్లాకు నియమితులైన ఎన్నికల వ్యయ పరిశీలకులు డి. శ్రీనివాస్ శుక్రవారం మెట్ పెల్లి మున్సిపాలిటీలో జరుగుతున్న నామినేషన్ల సరళిని పరిశీలించారు.ఈ సందర్భంగా ఎన్నికల వ్యయ పరిశీలకులు డి. శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు అందరు ఎన్నికల నియమావళి మేరకు విధులు నిర్వర్తించాలని,అన్ని పత్రాలు నింపడం,సరైనా ధ్రువీకరణ పత్రాలు వంటివి రిటర్నింగ్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలంచాలని రిటర్నింగ్ అధికారులకు సూచించారు.అలాగే పోటీ చేసే అభ్యర్థులు నిర్దేశించిన వ్యయ పరిమితి మేరకు ఖర్చులు చేయాలని, అందుకు ప్రత్యేక బ్యాంక్ ఖాతా తీసుకోవాలని ఖర్చులు చేసిన మేరకు బిల్లులు సమర్పించాలని, అలాగే పార్టీ పరంగా చేసే వ్యయం,పార్టీ తరుపున పోటీ చేసే అభ్యర్థి వ్యయం లను అన్నింటిని నమోదు చేయాలని సహాయ ఎన్నికల వ్యయ పరిశీలకులకు సూచించారు.ఈకార్యక్రమం లో నోడల్ అధికారి శ్రీనివాస్ గౌడ్,మున్సిపల్ కమిషనర్ మోహన్,తహసీల్దార్ నీత, సహాయ ఎన్నికల వ్యయ పరిశీలకులు,రిటర్నింగ్ అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# గౌరవ వేతనాన్ని అందజేసిన సర్పంచ్

**ఇబ్రహీంపట్నం, ప్రభాతవార్త :**



మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వర్షకొండ లో గ్రామ సర్పంచ్ పొనకంటి వెంకట్ సమక్షంలో శుక్రవారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో సర్పంచ్ తనకు వచ్చే గౌరవ వేతనాన్ని పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు విద్యా వాలంటీర్లకు ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ వరకు మూడు నెలల వేతనాల చెల్లింపుకు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు అప్ప విజయ భాస్కర్ ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల తరపున సర్పంచ్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

# పంట మార్పిడితో భూ సారం పెరుగుతుంది

### జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్ కుమార్



**కట్టంగూర్, జనవరి 30, ప్రభాతవార్త,** కట్టంగూర్ మండలం పరిధిలో చెరువుఅన్నారం గ్రామంలో జాతీయ నూనె గింజల పథకం 202526 కింద యాసంగిలో విత్తనాలు పంపిణీ చేసిన రైతుల పొలాలను శుక్రవారం జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు వేప నూనె వేరుశనగ ఉపయోగాలు తెలియజేస్తూ వేరుశనగ పంట కాలంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. అలాగే పంట మార్పిడి చేసుకోవడం వలన భూమిలో సారం పెరిగి వచ్చేసారి వేసుకునే పంట మంచిగా పండి దిగుబడి పెరుగుతుందని, పత్తి పంట తర్వాత యాసంగిలో పెసర మినుము వేరుశనగ వంటి నూనె గింజల, పప్పు పంటలను వేసుకోవడం వల్ల భూమిలో పంటలకు ఉపయోగపడే సూక్ష్మజీవులు పెరగడం వలన ఆ తర్వాత వేసే పంటలు లో ఎరువుల వాడకం తగ్గడమే కాకుండా భూమి సారవంతం అవుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏవో టెక్నికల్ ఉమారాణి, కీర్తి, ఏఈఓ రమణ మరియు రైతులు గద్దపాటి శ్రీను, కొమ్ము ఆంజనేయులు, కొమ్ము చిరంజీవి, జక్కలి అవిలయ్య, దెందే సురేష్, యోగి తదితరులు పాల్గొన్నారు.

# శివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష

**నార్కెట్ పల్లి ప్రభాతవార్త జనవరి 30** రానున్న శివరాత్రి పర్వదినం సందర్భంగా నార్కట్పల్లి పట్టణ కేంద్రంలోని బస్టాండ్ వెనుక గల శ్రీ శ్రీ పార్వతీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లపై ఆలయ చైర్మన్ అర్చకులు కమిటీ సభ్యులు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం గ్రామ సర్పంచ్ జేరిపోతుల భరత్ గ్రామ ప్రజలు భక్తుల సహాయ సహకారాలతో ఈ సంవత్సరం శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని తీర్మానం చేసినట్లు తెలిపారు. దాతలు సహకరించి ఆర్థిక హార్దిక సహాయ సహకారాలు అందించి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో చైర్మన్ పుల్లెంల శ్రీనివాస్,ప్రధాన అర్చకులు నిడికొండ భగవాన్ శర్మ,డైరెక్టర్లు జేరిపోతుల పద్మ, కర్నాటి రమాదేవి, వేముల మాధవి,వడ్డేగోని నాగమణి, సోమ మాధవి, యాదా వెంకన్న, పసునూరి వాసవి దయాకర్ , గర్దాస్ వెంకటేశ్వర్లు, వార్డు సభ్యులు నడింపల్లి నరేష్,మేడబోయిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మహా శివరాత్రి జాతర పోస్టర్లను ఆవిష్కరించిన ఇంచార్జి కలెక్టర్

## -ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్‌కు ఆహ్వాన పత్రిక అందించిన ఆలయ ఈఓ, అర్చకులు

సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త :

ఈ నెల 14వ తేదీ నుంచి నిర్వహించనున్న మహా శివరాత్రి జాతర పోస్టర్లను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆవిష్కరించారు. ఈ నెల 14వ తేదీ నుంచి వేములవాడలో నిర్వహించనున్న మహా శివరాత్రి జాతర పోస్టర్లను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆలయ ఈఓ రమాదేవి, అధికారులు, అర్చకులతో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం ఆలయ ఈఓ, అర్చకులు ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ కు జాతర ఆహ్వాన పత్రికను అందజేశారు.ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీ నుంచి 16 వ తేదీ వరకు వేములవాడలో



మహా శివరాత్రి జాతర ఉత్సవాలు నిర్వహించనున్నామని వెల్లడించారు. 15 వ తేదీన మహా శివరాత్రి జాతర నిర్వహించనున్నామని తెలిపారు. జాతర సందర్భంగా భక్తులకు కల్పిస్తున్న ఏర్పాట్లపై అధికారులను ఇంచార్జి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రణాళిక ప్రకారం అన్ని వసతులు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఈ రాజేష్, డీఈ రఘునందన్, అర్చకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మహాత్మా గాంధీ వర్ధంతి వేడుకలు

ఇల్లంతకుంట, ప్రభాతవార్త:



జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు.గాంధీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టి,సమాజ అభివృద్ధికి పాటుపడాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజు,నాయకులు రేగుల కార్తీక్,చేరాల వంశీకృష్ణ,అంతటి శ్రీకాంత్ గౌడ్,కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు మామిడి నరేష్,ఎర్రోజు సంతోష్ కుమార్, జమాల్,నార్ల రాంకిషన్, కూన బోయిన బాలరాజు,రవీందర్ రెడ్డి,పర్శరాం కూనబోయిన సుధాకర్ పాల్గొన్నారు.

# వెంకట్రావు పల్లెలో పౌర హక్కుల దినం

ఇల్లంతకుంట, ప్రభాతవార్త:




మండలములోని వెంకట్రావుపల్లెలో శుక్రవారం పౌర హక్కుల దినాన్ని ఏర్పాటు చేశారు.గ్రామ సర్పంచ్ చల్ల నవీన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశములోఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మూఢ నమ్మకాలు పారద్రోలాలని సూచించారు.ఈ కార్యక్రమంలోఏంపిఓ శ్రీనివాస్,ఆర్ఐ సంతోష్ ,కానిస్టేబుల్ రమణారెడ్డి ,జిపిఓ స్వప్న, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు మంద రాజు, కార్యదర్శి ప్రియాంక, ఉప సర్పంచ్ అనగోని అవినాష్,వార్డు సభ్యులు మంద రేణుక, మంద అనిల్ పాల్గొన్నారు.

### సమ్మక్క - సారలమ్మ జాతరలో భక్తులతో కిక్కిరిసిన కమలాపూర్

**కమలాపూర్, ప్రభాత వార్త:**కమలాపూర్ మండలంలోని కన్నూరు, కమలాపూర్, మాదన్నపేట, మర్రిపల్లిగూడెం గ్రామాలలో జరిగే సమ్మక్క - సారలమ్మ జాతర భక్తులతో కిక్కిరిసిపోయింది. శుక్రవారం వనదేవతల దర్శనం కోసం భక్తులు క్యూలైన్ కట్టారు. ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కలు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాతర కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లను చేయడంతో ప్రశాంత వాతావరణంలో మొక్కలు చెల్లించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాదన్నపేట, మర్రిపల్లిగడెం గ్రామాలలో సమ్మక్క - సారలమ్మ జాతరను టిపిసిసి ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్ జాతరను సందర్శించి సమ్మక్క - సారలమ్మలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జాతరకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై వనదేవతలను ప్రశాంత వాతావరణంలో దర్శించుకున్నారు.



# సిరిసిల్ల మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ మూడవ జాబితా విడుదల

## -8 మంది అభ్యర్థులను ప్రకటించిన బీఆర్ఎస్ మున్సిపల్ ఎన్నికల ఇంచార్జి తుల ఉమ

సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త :

సిరిసిల్ల మున్సిపల్ ఎన్నికల్లో బి ఆర్ఎస్ మూడో జాబితాను మున్సిపల్ ఎన్నికల ఇంచార్జ్ తుల ఉమా ప్రకటించారు . శుక్రవారం విడుదల చేసిన జాబితాలో అభ్యర్థులు వీరే పదో వార్డు నాగుల కావ్య ఎల్లం ,15 వార్డు కూర భాగ్యలక్ష్మి ్మ దేవేందర్, 18 వ వార్డు గడ్డం చందన భగవాన్, 23వ వార్డు కల్లూరి లతా మధు,25 వార్డు బింగి రామాంజనేయులు,26 నెల్లుట్ల నరేష్, 31 వార్డు పాసికంటి రమ్య సత్యనారాయణ ,37 వార్డు దిడ్డి మాధవి రాజు, బిఆర్ఎస్ అభ్యర్థులుగా ప్రకటించారు.

# ముగిసిన నామినేషన్ల జాతర

## -మూడవరోజు 275 నామినేషన్లు

## -241 అభ్యర్థులు 429 నామినేషన్లు దాఖలు

సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త :



సిరిసిల్ల మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల జాతర ముగిసింది. శుక్రవారం మూడో రోజు నామినేషన్లు275 అధికారులు స్వీకరించారు. బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు130 , కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు 117, బిజెపి పార్టీ అభ్యర్థులు 96, బీఎస్పీ 4 సిపిఎం 5, ఇతర పార్టీలు 18 , ఇండిపెండెంట్ అభ్యర్థులు 59 నామినేషన్లను దాఖలు చేశారు. మూడో రోజు మొత్తం నామినేషన్లు 275 అధికారులు స్వీకరించారు. 39 వార్డులకు మూడు రోజుల నామినేషన్లు మొత్తం 429

# మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో 'వార్త' దినపత్రిక క్యాలెండర్ ఆవిష్కరణ

భీమారం/మేడిపల్లి, ప్రభాతవార్త :

మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో 'వార్త' దినపత్రిక క్యాలెండర్‌ను సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి చేతుల మీదుగా ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రజలకు సరైన సమాచారం అందించడంలో పత్రికలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే వార్తా మాధ్యమాల సేవ అభినందనీయమని తెలిపారు. ప్రజలు పోలీసుల మధ్య మరింత మంచి సంబంధాలను పెంపొందించడంలో సానుకూల మీడియా కీలకమని పేర్కొంటూ, 'వార్త' దినపత్రిక ప్రజా ప్రయోజనానికి అంకితభావంతో పని చేస్తోందని ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో లక్ష్మీపతి, దయాకర్, ఆంజనేయులు, ప్రేమ్, వజ్ర లింగం, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.




# సిరిసిల్ల వార్త

# టెట్ నుండి ఉపాధ్యాయులను మినహాయించాలి

## -డిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఎర్ర సత్యనారాయణ

గంభీరావుపేట, ప్రభాతవార్త:



టెట్ నుండి ఉపాధ్యాయులను మినహాయించాలని డిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఎర్ర సత్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం గంభీరావుపేట మండల కేంద్రంలోని కేజీ టు పీజీ క్యాంపస్ ఆవరణలో డిటిఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2010 కంటే ముందు నియామకమైన ఉపాధ్యాయులను టెట్ నుండి మినహాయించి, ప్రభుత్వం ఇవ్వాల్సిన ఆరు డిఎ బకాయిలు మంజూరు చేయాలని కోరారు. పిఆర్సి కమిటీ నివేదికను తెప్పించి వెంటనే అమలు, గత సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం కుల గణన సర్వే నిర్వహించిన రెమ్యూనరేషన్ మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిటిఎఫ్ మండల అధ్యక్షులు షీలా కుమార్, ప్రధాన కార్యదర్శి దోసల మధు , మండల విద్యాధికారి సంటి గంగారం, మండల కార్యవర్గం సభ్యులు కె శ్రీనివాస్ రెడ్డి, పాశం తిరుపతిరెడ్డి, లక్ష్మణ చారి, చీకట్ల రాజు, శ్రీకాంత్ రెడ్డి, పరశురాములు, సాయి ,గంగా, శాంత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# వైజ్ఞానిక ప్రదర్శనలలో రాణించిన విద్యార్థులకు మేమేంటోలు

గంభీరావుపేట, ప్రభాతవార్త;



వైజ్ఞానిక ప్రదర్శనలో రాణించిన గంభీరావుపేట మండలం దమ్మన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం మెమొంటోలు అందజేశారు. గత నాలుగు సంవత్సరాలుగా వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు రాణిస్తుంది, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు మండల కేంద్రానికి చెందిన ఈరవేని స్వప్న విద్యార్థులకు మెమొంటోలు అందజేసి అభినందించారు. రాష్ట్రస్థాయి, జాతీయస్థాయిలో వైజ్ఞానిక ప్రదర్శనలో రాణిస్తున్న 28 మంది విద్యార్థులకు ఇట్టి మెమొంటోలు అందజేసినట్లు ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు బోయన్న గారి నారాయణ తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు ముందుకు వచ్చిన ఈరవేని స్వప్నకు పాఠశాల ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

# ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

**జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:**భారీ ర్యాలీలు డబ్బు చప్పుల మధ్య చివరి రోజు నామినేషన్ల పర్వముగిసిందిజగిత్యాల జిల్లాలోని 5 జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల, మెట్పల్లి, రాయికల్ మున్సీపాలిటిల్లో శుక్రవారం నామినేషన్ల చివరిరోజు పెద్ద సంఖ్యలో కౌన్సిలర్ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు.కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్. పార్టీలు, స్వతంత్రులు ఒక్కో వార్డు ఎక్కువ మంది ఆశావాహులు టిక్కెట్ కోసం తీవ్ర పోటీనెలకొనగా నాయకులు సమయమనం పాటిస్తూ కార్యకర్తలను బుజ్జగించే పనుల్లో తలమూనకలై ఉన్నారు. జగిత్యాల మున్సిపల్ లో పరిస్థితి మరోలా ఉన్నది.ఎమ్మెల్యే, సంజయ్ కుమార్ మాజీ మంత్రి మధ్య పచ్చగడ్డి వేస్తే బగ్గుమానేలా ఉండగ ఇక్కడ ఎవరికీ పార్టీ బీ ఫారాలు అధిష్టానం ఇస్తుందోనని ఆశవాహుల్కో తీవ్ర ఉత్కంట నెలకొన్నప్పటికీ పోటా పోటీగా అభ్యర్థులు నామినేషన్లు వేశారు.

# అంతర్గాం హైస్కూల్‌లో ఘనంగా సీఎం కప్ క్రీడల ప్రారంభం

జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త:



జగిత్యాల మండలం రూరల్ అంతర్గాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికగా సీఎం కప్ సెకండ్ ఎడిషన్ మండల స్థాయి క్రీడా పోటీలు శుక్రవారం అత్యంత ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి.ఈ పోటీలను మండల విద్యాధికారి గంగాధర్,స్థానిక సర్పంచ్ నోముల రమ్య శేఖర్ రెడ్డి,ప్రధానోపాధ్యాయులు సింగు సత్తయ్య జ్యోతి ప్రజ్వలన చేసి అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంఈఓ గంగాధర్ మాట్లాడుతూ,క్రీడలు పిల్లలశారీరక ఆరోగ్యానికే కాకుండా,మానసిక ఉల్లాసానికి ఒత్తిడిని తగ్గించడానికి ఎంతో దోహదపడతాయని తెలిపారు.విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామ సర్పంచ్ నోముల రమ్య శేఖర్ రెడ్డి



మాట్లాడుతూ క్రీడలు విద్యార్థులలో క్రమశిక్షణను,జట్టు స్ఫూర్తిని పెంపొందిస్తాయని అన్నారు.గెలుపోటములతో సంబంధం లేకుండా అందరితో స్నేహపూర్వకంగా ఉంటూ,క్రీడల ద్వారా మంచి సంబంధాలను నెలకొల్పుకోవాలని సూచించారు.విద్యార్థులు ఆటపాటలతో చురుగ్గా ఉంటే,వారు చదువులో కూడా ముందంజలో ఉంటారని, ప్రతిభావంతులైన క్రీడాకారులకు పాఠశాల తరపున పూర్తి ప్రోత్సాహం ఉంటుందని ప్రధానోపాధ్యాయులు సింగు సత్తయ్య పేర్కొన్నారు.ఈ మండల స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ప్రత్యేకంగా ఎంపిక చేసి,వారిని తదుపరి స్థాయిలో జరిగే జిల్లా స్థాయి పోటీలకు పంపించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు కోటేశ్వరరావు, అజయ్ బాబు,మల్లీశ్వరి, జమున,వెంకటలక్ష్మి ్ర, హారిక,రాజచందర్,సతీష్, ఉపాధ్యాయులు బాలె సరోజ,అనిత,శరత్ ఇతర పాఠశాలల పిఈటీలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కోర్టుల చుట్టూ కర్షకులు ఐదేళ్లు దాటినా వీడని కేసుల కష్టాలు

జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త:

ప్రభుత్వాలు మారుతున్నా రైతుల కష్టాలు, వారి కోసం పోరాడే నాయకుల పాట్లు తీరడం లేదు. మద్దతు ధర,చక్కెర ఫ్యాక్టరీ పునరుద్ధరణ వంటి ప్రజా సమస్యలపై పోరాడినందుకు పెట్టిన కేసుల కారణంగా రైతు నాయకులు ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.శుక్రవారం మెట్‌పల్లి కోర్టులో గతంలో జరిగిన ఖిమక్కల ధర్నాఖి కు సంబంధించిన కేసుల విచారణ జరిగింది.సిసి నెం 434/2021, 460/2021 కేసులకు సంబంధించి సుమారు 30 మంది రైతు నాయకులు న్యాయస్థానం ముందు హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతు నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి మాట్లాడుతూ గత ఐదారేళ్లుగా తాము కోర్టుల చుట్టూ తిరుగుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.గత ప్రభుత్వం కక్షపూరితంగా పెట్టిన ఈ కేసులను,ప్రస్తుత ప్రభుత్వం తక్షణమే కొట్టివేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.నాడు ప్రతిపక్షంలో ఉండి రైతులతో కలిసి పోరాడిన నేటి పాలకపక్షం అధికారంలోకి వచ్చాక రైతులకు ఇచ్చిన హామీలను విస్మరించడం సరికాదని వారు పేర్కొన్నారు.రైతు రుణమాఫీ,



ధాన్యానికి బోనస్, ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధర ణవంటి కీలక వాగ్దానాలను వెంటనే నెరవేర్చాలని, లేనిపక్షంలో మరోసారి పోరాటాలు తప్పవని హెచ్చరించారు.కోర్టుకు హాజరైన వారిలో పన్నాల తిరుపతి రెడ్డితో పాటు మారు మురళీధర్ రెడ్డి, కొడిపెల్లి గోపాల్ రెడ్డి,మామిడి నారాయణ రెడ్డి, వేముల కర్ణాకర్ రెడ్డి,కొమిరెడ్డి లింగారెడ్డి,అన్నడి జలపతి రెడ్డి,బందెల మల్లయ్య,బద్దం మహేందర్ రెడ్డి,శంకర్ రెడ్డి,నాగుల వామన్ రెడ్డి,మహిపాల్, బద్దం శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## మొరపల్లిలో ఘనంగా మొదటి గ్రామ సగ్రామ రక్షణకు మూడవ కన్ను ఆవశ్యం

### -రూరల్ ఎస్సై ఉమ సాగర్ పిలుపు

జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త:

జగిత్యాల మండలం రూరల్ మొరపల్లి గ్రామంలో మొదటి గ్రామ సభ సమావేశం అత్యంత ఉత్సాహంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి జగిత్యాల రూరల్ ఎస్సై ఉమ సాగర్ ముఖ్య అతిథిగా విచ్చేసి,గ్రామస్తులతో ముఖాముఖి మాట్లాడారు.ఈ సందర్భంగా ఎస్సై ఉమ సాగర్ మాట్లాడుతూ,ప్రస్తుత కాలంలో గ్రామాల్లో భద్రత కోసం సీసీ కెమెరాల ఏర్పాటు ఎంతో ఆవశ్యకమని పేర్కొన్నారు. గ్రామస్తులందరూ సహకరించి కీలక ప్రాంతాల్లో కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే,దొంగతనాల నియంత్రణతో పాటు నేరస్తులను త్వరగా పట్టుకోవడానికి వీలవుతుందని వివరించారు. గ్రామం మూడవ కన్ను నీడలో ఉంటే ప్రతి ఒక్కరూ సురక్షితంగా ఉండవచ్చని సూచించారు.అనంతరం జరిగిన గ్రామ సభలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. డ్రైనేజీ, తాగునీరు,విద్యుత్ సరఫరా వంటి మౌలిక వసతుల మెరుగుదలకు సర్పంచ్,అధికారులు హామీ ఇచ్చారు.సర్పంచ్ కట్ట రాజేందర్,ఉప సర్పంచ్,వార్డు సభ్యులు,పంచాయతీ కార్యదర్శి ఏఎన్ఎం,ఆశ వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు విద్యుత్ శాఖ సిబ్బంది,స్థానిక పోలీస్ సిబ్బంది,గ్రామ సిబ్బందితో పాటు భారీ సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## మాజీ ఎంపిటిసి రాజిరెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్

జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త:



జగిత్యాల మండలం రూరల్ అంతర్గం గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి రాజిరెడ్డిని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పరామర్శించారు.గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రాజిరెడ్డి, కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొంది ఇటీవలే ఇంటికి చేరుకున్నారు.ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే,అంతర్గం గ్రామంలోని రాజిరెడ్డి నివాసానికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ,ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట స్థానిక మండల,గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జగిత్యాల వార్త



## మారేడు ఆకుపై అమ్మ వార్ల ప్రతిరూపం

### -గుండేటి రాజు కుంచె నుండి జాలువారిన అపురూపం

జగిత్యాల టౌన్ ప్రభాత వార్త :





జగిత్యాల జిల్లాలో కవులు, కళాకారులకు కొదవదలేదని మరోసారి నిరూపితమైంది.తెలంగాణలో నాలుగు రోజులపాటు జరిగే గిరిజన జాతర కుంభమేలాను తలపించేలా లక్షలాది మంది భక్తులు మొక్కులు చెల్లించుకుంటున్నారు.అయితే జగిత్యాలకు చెందిన చిత్రకారుడు కళాశ్రీ గుండేటి రాజు మారేడు ఆకుపై సమ్మక్క సారక్క ప్రతిమలను తన కుంచెతో చిత్రీకరించి కళను చాటుకుని అందరి ప్రశంసలు అందుకున్నారు. శుక్రవారం సమ్మక్క, సారక్క ఇద్దరు తల్లులు గద్దెపై కొలువుదీరిన సందర్భంగా అమ్మవార్లపై ఉన్న భక్తితో మారేడు ఆకుపై తల్లులను గీసి అందరిని అబ్బురపర్చారు. గుండేటి రాజు కుంచె నుండి జాలువారిన సమ్మక్క సారలమ్మల అపురూప చిత్రాన్ని చుసి జగిత్యాల జిల్లా వాసులు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

## బిఆర్ఎస్ అభ్యర్థుల నామినేషన్ దాఖలు

జగిత్యాల టౌన్, ప్రభాత వార్త:



జగిత్యాల పట్టణం లోని 50 వార్డు లకు జరగనున్న మున్సిపల్ ఎన్నికల్ల నేపథ్యంలో బిఆర్ఎస్ పార్టీ తర పున అభ్యర్థులు శుక్ర వారం వారం రోజున నామినే షన్‌లు దాఖలు చేశారు.ఈ సం దర్భంగా తాజా మాజీ కౌన్సిలర్ శివకేసరి బాబు మాట్లాడుతూ అన్ని వార్డు లలో ప్రజలు బి ఆర్ ఎస్ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని 44వ వార్డు మహిళల కు రిజర్వ్ కావడం వలన ఆ వార్డు నుండి పోటీ లో ఉన్న అవారి పవిత్ర శివకేసరి లను వార్డు ప్రజలు అధిక మెజారిటీ తో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

## గ్రామపంచాయతీ రికార్డుల మాయమైన విషయం పైన అధికారులు విచారణ చేపట్టాలి

### -మాజీ సర్పంచ్ ముక్క శంకర్

బీర్ పూర్ ప్రభాత వార్త:



జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలంలోని తుంగూరు గ్రామపంచాయతీలో రెండు రోజుల క్రితం సి ఆర్ సి బృందం వారు గ్రామపంచాయతీ రికార్డులను తనిఖీ చేశారని అందులో 2014 నుండి 2023 వరకు రికార్డులు మాయమైనట్టు సి ఆర్ సి బృందం వారు తెలిపిన విషయంపై తుంగూరు గ్రామ మాజీ సర్పంచ్ ముక్క శంకర్ యాదవ్ స్పందించారు. 9 సంవత్సరాల రికార్డులు ఏమైనయని రికార్డులు మాయం చేసిన వారిపైన అధికారులు పూర్తిస్థాయి విచారణ చేసి దోషుల పైన కఠిన చర్యలు తీసుకోవాలని పత్రిక ప్రకటన ద్వారా తెలియజేస్తున్నట్టు తెలిపారు. రికార్డుల మాయం విషయం పైన త్వరలో జిల్లా కలెక్టర్ డిపిఓ గారికి కూడా వినతిపత్రం ఇవ్వబోతున్నట్టు ముక్క శంకర్ తెలియజేశారు.

# సమ్మక్క - సారలమ్మ జాతరలో మొక్కులు సమర్పించిన వి. ప్రణవ్

జమ్మికుంట/హుజూరాబాద్, ప్రభాత వార్త:

వనదేవతలుగా పేరుగాంచిన సమ్మక్క - సారలమ్మలను హుజూరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ వొడితల ప్రణవ్ బాబు దర్శించుకొని మొక్కులు సమర్పించుకున్నారు. శుక్రవారం హుజూరాబాద్ పట్టణ శివారులోని రంగనాయకుల గుట్ట వద్ద గల సమ్మక్క - సారలమ్మ జాతరను, జూపాక గ్రామంలోని సమ్మక్క జాతర లను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు హుజూరాబాద్ సమ్మక్క జాతర కమిటి చైర్మన్ గంట కిరణ్ రెడ్డి, డైరెక్టర్లు, నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన సమ్మక్క - సారలమ్మలను దర్శించుకుని మొక్కులు అప్పచెప్పారు. అంతకు ముందు ఆయనను తులాభారం చేసి బంగారాన్ని అమ్మవారికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రెండేళ్లకోసారి జరిగే సమ్మక్క - సారలమ్మ జాతర లో కొలువయ్యే వనదేవతలు భక్తుల కోరికలు తీరుస్తారని అన్నారు. వన దేవతలుగా భావించే సమ్మక్క - సారలమ్మలో మహిళల్లో ధైర్యానికి ప్రతీకలుగా నిలిచారని అన్నారు. సమ్మక్క - సారలమ్మలు ఈ ప్రాంత ప్రజల కోరికలు తీరుస్తూ సుఖ సంతోషాలుగా ఉండాలని కోరుకున్నానని అన్నారు. ప్రభుత్వం తరఫున జాతరలో అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జూపాక జాతర కమిటి చైర్మన్ సాయి కుమార్, డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**-- కేశవాపూర్‌లో...**

జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కేశవాపూర్ లో జరుగుతున్న సమ్మక్క - సారలమ్మ జాతరలో పాల్గొని తల్లులను హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ దర్శించుకోని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా జాతర నిర్వహణ కమిటి డప్పు చప్పుళ్ళతో, కొలాటాలతో భారీగా ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్మవార్లకు పూజలు చేసి, నెత్తిన బెల్లం(బంగారం) పెట్టుకొని గద్దెలపై సమర్పించారు. వనం నుండి జనంలోకి తల్లులు వచ్చిన వేళ హుజురాబాద్ నియోజకవర్గంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆ తల్లులను వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమ్మక్క - సారలమ్మ జాతర చైర్మన్ భద్రయ్య, డైరెక్టర్లు, వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ సతీష్ రెడ్డి, జమ్మికుంట పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేష్, సీనియర్ నాయకులు పొనగంటి మల్లయ్య, దేశిని కోటి, సాయిని రవి, అజయ్, రమేష్, కేశవాపూర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.







# జాతరలో టెంకాయ కొట్టకుండా అవమానించడం బాధాకరం

## -- వీణవంక సర్పంచ్

వీణవంక, ప్రభాత వార్త:

వీణవంక మండల కేంద్రంలో జరుగుతున్న సమ్మక్క - సారలమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా గురువారం హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తో పాటుగా, వీణవంక గ్రామ సర్పంచ్ గా సమ్మక్క గద్దె మీద టెంకాయ



కొట్టే ప్రయత్నంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని అరెస్టు చేయడం సరి కాదని, గ్రామ సర్పంచ్ గా టెంకాయ కొట్టకుండా పోలీసులు జాతర ప్రాంగణం నుండి వెళ్లగొట్టడం చాలా బాధాకరమని వీణవంక గ్రామ సర్పంచ్ దాసరపు సరోజన రాజేంద్రప్రసాద్ అన్నారు. వీణవంక గ్రామంలో ప్రజలు ఎన్నుకుంటే మేము గెలవడం జరిగిందని, జాతర ఉత్సవాలలో పాలకవర్గానికి చోటు కల్పించపోవడం అమానుషమని, దళిత సర్పంచును అవమానించడం జీర్ణించుకోలేకపోతున్నామని, గ్రామ మొదటి ప్రథమ పౌరులుగా ప్రతి సమావేశంలో, ప్రతి ఉత్సవంలో పాల్గొని హక్కు ఉంటుందని అన్నారు. వీణవంక సమ్మక్క - సారలమ్మ ఉత్సవాలు నియంతృత్వ పాలనను గుర్తు చేస్తున్నాయని ఆవేదనను వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తాళ్లపల్లి మహేందర్, మాజీ ఉప సర్పంచ్ భానుచందర్, వార్డు సభ్యులు శ్రీకాంత్, రాజు పాల్గొన్నారు.

# హుజురాబాద్ ప్రజలకు సమ్మక్క ఆశీస్సులుండాలి...

**ఎత్తు బెల్లం... కుటుంబ సమేతంగా మొక్కులు చెల్లించుకొన్న ఎమ్మెల్యే...**

వీణవంక, ప్రభాత వార్త:

హుజురాబాద్ ప్రజలకు సమ్మక్క ఆశీస్సులుండాలని స్థానిక ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. శుక్రవారం వీణవంక మండల కేంద్రంలో సమ్మక్క - సారలమ్మ కు ఎత్తుబెల్లం ఇవ్వడం తో పాటు కుటుంబ సభ్యులతో సమ్మక్క - సారలమ్మ కు మొక్కులు చెల్లించుకొన్నారు. దీనికి ముందు సమ్మక్క కు మొక్కులు చెల్లించుకోవడానికి గ్రామ సర్పంచ్ దాసారపు సరోజన రాజేంద్రప్రసాద్, గ్రామ పంచాయతీ పాలక వర్గంతో పాటు వివిధ గ్రామాల బిఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు, గ్రామస్థులతో పాటు కుటుంబ సమేతంగా తండ్రి సాయినాథ్ రెడ్డి, సోదరుడు లతో డప్పు చప్పుళ్ళతో భారీ ఊరేగింపు గా సమ్మక్క గద్దెలకు చేరుకొని మొక్కులు చెల్లించుకొన్నారు.

**-- జాతర స్థలములో నాది సాగముంది... ఎమ్మెల్యే**

వీణవంక జాతర నిజంగా ఎండోమెంట్ దేనని, నాకు ఈ స్థలములో సగ భాగముందని ఎమ్మెల్యే అన్నారు. నన్ను ఎంత మంది ఇబ్బంది పెట్టిన నేను ఈ జాతర అభివృద్ధికి లక్షల్లో ఖర్చు చేశానని, ఇది నాది... నీది అనకుండా దేవునికి చేసిన సేవ అని అన్నారు. ఆయన వెంట మాజీ ఎంపిపి ముసిపట్ల రేణుక తిరుపతి రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి రాయిశెట్టి లత శ్రీనివాస్, వైస్ సర్పంచ్ మహేష్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.





# హుజూరాబాద్ వార్త

# సమ్మక్క - సారలమ్మ జాతరలో భారీగా మొక్కులు సమర్పించుకున్న భక్తులు

హుజూరాబాద్ టౌన్, ప్రభాత వార్త:

భక్తుల కోర్కెలు తీర్చే వనదేవతలైన సమ్మక్క - సారలమ్మలను దర్శించుకుని మొక్కులు అప్ప చెప్పేందుకు భక్తులు భారీ సంఖ్యలో రావడంతో హుజురాబాద్ పట్టణ శివారులోని రంగనాయకుల గుట్ట వద్ద జరిగే సమ్మక్క జాతర జనసాంద్రంగా మారింది. ఈనెల 28 నుండి





ప్రారంభమైన సమ్మక్క జాతర శుక్రవారం వనదేవతలు సమ్మక్క - సారలమ్మలు గద్దెపైకి చేరడంతో తల్లి బిడ్డలను దర్శించుకుని తమ కుటుంబాన్ని చల్లగా చూడాలని వేడుకోవడానికి భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. సమ్మక్క - సారలమ్మలను దర్శించుకోవడానికి వచ్చిన భక్తులు భారీ సంఖ్యలో ఉండడంతో వారికి దర్శనం కావడానికి చాలా సమయం పట్టింది. సమ్మక్క - సారలమ్మ దర్శనం కోసం వచ్చే భక్తులు, శివసత్తుల పూనకాలతో సమ్మక్క జాతర ప్రాంగణమంతా భక్తి భావంతో నిండిపోయింది. గురువారం రాత్రి సమ్మక్క దేవత గద్దెపైకి రాగానే చాలా మంది భక్తులు తమ కుటుంబ సభ్యులతో వచ్చి రంగనాయకుల గుట్ట పరిసర ప్రాంతాల్లోనే బస చేశారు. శుక్రవారం తల్లి బిడ్డలను దర్శించుకుని తమ కుటుంబాన్ని చల్లగా కాపాడాలని వేడుకున్నారు.

# వీణవంక జాతరలో భారీగా పోటెత్తిన భక్తులు...

**-- కోర్కల్, చల్లూరు, పోతిరెడ్డిపల్లిలో పోటెత్తిన భక్తులు**

**-- హాజరైన ఎమ్మెల్సీ, ప్రముఖులు**

వీణవంక, ప్రభాత వార్త:

వీణవంక మండలం కేంద్రములో జరుగుతున్న సమ్మక్క జాతర గతములోకంటే ఈసారి భారీ సంఖ్యలో భక్తులు పోటెత్తగా మండలములోని కోర్కల్, పోతిరెడ్డిపల్లి, చల్లూరు భక్తులు పోటెత్తారు. ఆయా గ్రామాల గతములో కంటే జాతర కమిటీ చైర్మన్ లు పాడి ఉదయ్ రెడ్డి, స్వర్గీయ కర్ర గోపాల్ రెడ్డి తనయుడు కర్ర హరిణ్ రెడ్డి, పరిపాటి రవీందర్ రెడ్డి లు గతం కంటే వసతులు కనిపించడంతో భక్తులు పోటెత్తినట్లు తెలిపారు. కాగా ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, మండలములోని వీణవంక, పోతిరెడ్డి పల్లి, చల్లూరు జాతరలో హాజరై సమ్మక్కకు మొక్కలు చెల్లించుకోగా, వీణవంకలో ఎస్‌సి కమిషన్ చైర్మన్ శ్రీనివాస్, రిటైర్డ్ డిజిపి అనురాగ్ శర్మ, కాంగ్రెస్ నియోజకవర్గ ఇంఛార్జి వొడితల ప్రణవ్ లు సమ్మక్క-సారలమ్మలను దర్శించుకున్నారు. వీరి వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎక్కేటి రఘుపాల్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు శ్యామ్ సుందర్ రెడ్డి, నేతలు గంగాడి తిరుపతి రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ లు మాదాసు సునీల్, సతీష్, రషీద్, శ్రీపతి రెడ్డి, వివిధ గ్రామాల కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఆయిల్ పామ్ ప్లాంటేషన్ లక్ష్యాన్ని పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:

ఫిబ్రవరి నెలలో జిల్లాలో కనీసం 50 ఎకరాల ఆయిల్ పామ్ ప్లాంటేషన్ పనులు పూర్తి కావాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను ఆదేశించారు. శుక్రవారం పెద్దపల్లి మండలం రంగాపూర్, గట్టి సింగారం గ్రామాలలో పర్యటించిన కలెక్టర్, అక్కడ రవీందర్ రెడ్డి అనే రైతు నూతనంగా సాగు చేస్తున్న ఆయిల్ పామ్ పంట పొలాలను స్వయంగా ట్రాక్టర్‌పై ప్రయాణిస్తూ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగాపూర్, గట్టి సింగారం గ్రామాల్లో రైతులు సుమారు 100 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగుకు ముందుకు రావడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ సాగును ప్రోత్సహించడానికి గుట్టపై



విద్యుత్ సరఫరా కోసం కలెక్టరేట్ నుంచి 9 లక్షల రూపాయలు కేటాయించి పనులు పూర్తి చేశామని తెలిపారు. వచ్చే నెలలోగా నిర్దేశించిన 50 ఎకరాల్లో మొక్కలు నాటే ప్రక్రియ పూర్తి కావాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా హార్టికల్చర్ అధికారి జగన్ మోహన్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## వనదేవతల ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

### -ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు

పెద్దపల్లి, ప్రభాతవార్త:

పెద్దపల్లి మండలం హన్మంతునిపేట గ్రామంలో శ్రీ సమ్మక్కసారలమ్మ జాతర మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. ఈ వేడుకల్లో పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు శుక్రవారం పాల్గొని గద్దెలపై కొలువుదీరిన వనదేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు తన ఎత్తు బంగారాన్ని సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన, అనంతరం అక్కడే కొలువై ఉన్న గోవిందరాజు, పడిగిద్ద రాజును దర్శించుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు భక్తుల సౌకర్యార్థం నీరుకుల్ల, కొలనూరు, మిర్జంపేట, హన్మంతునిపేట, నారాయణపూర్, తరుకల మద్దికుంట, పెద్దరాతపల్లి వంటి పలు గ్రామాల్లో దాదాపు 8 కోట్ల రూపాయల పైచిలుకు నిధులతో తారు రోడ్ల నిర్మాణం పూర్తి చేశామని స్పష్టం చేశారు. తాము ఇచ్చిన మాట నెరవేరుస్తామే తప్ప మాట తప్పే ప్రసక్తే లేదని, జాతరకు విచ్చేసే భక్తులకు అధికారులు, కమిటీ



సభ్యులు మెరుగైన సౌకర్యాలు కల్పించడం అభినందనీయమని కొనియాడారు. అమ్మవార్ల ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని, పాడి పంటలతో రైతులందరూ ఆనందంగా ఉండాలని వేడుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్ నాయకులు, యువకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పెద్దపల్లి వార్త

## రామగుండం కార్పొరేషన్ ఎన్నికల బరిలో పతంగి రవీందర్ నామినేషన్ దాఖలు

గోదావరిఖని ,ప్రభాతవార్త:



రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల బరిలో పతంగి రవీందర్ నామినేషన్ దాఖలు చేశారు. శనివారం సంబంధిత రిటర్నింగ్ అధికారికి ఆయన నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ, ప్రజా సమస్యలపై నిత్యం స్వరం వినిపిస్తూ, నిజాయితీతో ప్రజాసేవ చేయాలనే సంకల్పంతో ఎన్నికల బరిలోకి దిగినట్లు తెలిపారు. రామగుండం అభివృద్ధి, పారదర్శక పాలన, ప్రజలకు అందుబాటులో ఉండే పరిపాలనే తన లక్ష్యమని పేర్కొన్నారు. నామినేషన్ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు, మద్దతుదారులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. రామగుండం కార్పొరేషన్ ఎన్నికలు ఆసక్తికరంగా మారుతున్న నేపథ్యంలో, రవీందర్ నామినేషన్ రాజకీయ వర్గాల్లో చర్చకు దారి తీసింది.

## పుట్టిన గడ్డ ఋణం తీర్చుకునేందుకే పోటీ 57వ డివిజన్ నుంచి గుండు రాజు బరిలో

గోదావరిఖని ,ప్రభాతవార్త:



పుట్టిన గడ్డకు సేవ చేయాలనే లక్ష్యంతో రామగుండం మున్సిపల్ కార్పొ రేషన్ 57వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థిగా గుండు రాజు ఎన్నికల బరిలో నిలిచారు. ప్రజల కష్టసుఖాల్లో భాగ స్వామిగా నిలిచి, వార్డు అభివృద్ధికి కృషి చేయాలనే సంకల్పంతో ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సంద ర్భంగా గుండు రాజు మాట్లాడుతూ.. "పెరిగిన ఊరు, నడిచిన బాటకు ఋణ పడి ఉన్నాను. ఆ ఋణం తీర్చుకునేందుకే ప్రజాసేవ మార్గాన్ని ఎంచు కున్నాను. రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో మీ ఆశీర్వాదం, అండదండలు నాకు అవసరం. మీ అమూల్యమైన ఓటుతో నన్ను గెలిపించి, మన 57వ డివిజన్ భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలి" అని విజ్ఞప్తి చేశారు. ప్రజల మద్దతుతో గెలిచి, ప్రాథమిక సౌకర్యాల అభివృద్ధి, సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తానని ఆయన హామీ ఇచ్చారు. మీ అమూల్యమైన ఓటే మన వార్డు భవిష్యత్తుకు పునాది అని ఆయన స్పష్టం చేశారు.

## జగిత్యాల జిల్లాలో 530 నామినేషన్లు

### ప్రశాంతంగా ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:

జగిత్యాల జిల్లాలో చివరి రోజు శుక్రవారం నామినేషన్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందిజగిత్యాల జిల్లాలో 5 మున్సిపాలిటీలకు జరుగనున్న ఎన్నికలకు సంబంధించి చివరి రోజు అన్ని పార్టీ లకు కలిసి మొత్తం 530 నామినేషన్ లు వచ్చినట్లు జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు.కాంగ్రెస్ : 239బిఆర్ఎస్ : 102బిజెపి: 120సిపిఐ : 01ఏ ఐ ఎమ్ ఐ ఎమ్: 16జనసేన :04ఏ ఐ ఎఫ్ బి:08ఇండిపెండెంట్ :40 మొత్తం 530 నామినేషన్లు పడ్డాయాన్ని పేర్కొన్నారు



## వనదేవతలను దర్శించుకున్న ఎమ్మెల్యే

కాల్వ శ్రీరాంపూర్ ప్రభాతవార్త:



మండల కేంద్రంలో వనదేవతలైన సమ్మక్క సారలమ్మ లను పెద్దపెల్లి ఎమ్మెల్యే విజారంగారావు శుక్రవారం దర్శించుకున్నారు మండలంలోని పెగడపల్లి పెద్ద రాతిపల్లి మీర్జంపేట గ్రామాలలో సమ్మక్క సారలమ్మ జాతరల లో దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమ్మక్క సారలమ్మ లు ప్రజలను చల్లగా చూసి ఆయురారోగ్యాలతో ఉండాలని వాలదేవతలను కోరారు మండలంలోని రైతులు తమ తమ పంటల ను చూడాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు మండల మాజీ అధ్యక్షుడు గోపగాని సాయ గౌడ్ ఆయా గ్రామాల సర్పంచులు మాజీ ఎంపీటీసీలు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## గిరిజన విద్యార్థులకు ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్ మార్చి 01 వరకు గడువు

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:

పెద్దపల్లి జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులకు ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్ దరఖాస్తుల గడువును మార్చి 01 వరకు నిర్ణయించినట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి సంగీత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి నుండి 8వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు న్యూ స్కీం కింద, అలాగే 9 మరియు 10వ తరగతి విద్యార్థులు రాజీవ్ విద్యా దీవెన పథకం కింద ఈపాస్ లాగిన్ ద్వారా తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆమె సూచించారు. రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత దరఖాస్తుల హార్డ్ కాపీలను కరీంనగర్‌లోని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో త్వరితగతిన సమర్పించాలని కోరారు. ఇతర వివరాలు లేదా సందేహాల కోసం విద్యార్థులు, తల్లిదండ్రులు 9502664044 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చని ఆమె ఆ ప్రకటనలో వివరించారు.

## గోలివాడ జాతరలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

### -సమ్మక్క-సారలమ్మకు మొక్కులు చెల్లింపు

గోదావరిఖని, ప్రభాత వార్త:



రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాగూర్ అంతర్గాం మండలం గోలివాడ గ్రామంలో ఘనంగా నిర్వహించిన శ్రీ సమ్మక్క-సారలమ్మ జాతరలో పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం అమ్మవార్లను ప్రార్థించిన ఎమ్మెల్యే, జాతరకు విచ్చేసిన భక్తులతో కలిసి సంప్రదాయ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం స్థానిక ప్రజలతో సన్నిహితంగా మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని జాతరకు శోభనిచ్చారు.

## 54వ డివిజన్ నుంచి మద్దెల శ్రీనివాస్ నామినేషన్

గోదావరిఖని, ప్రభాతవార్త:



రామగుండం మున్సిపల్ కార్పొరే షన్ 54వ డివిజన్ కార్పొరేటర్ అభ్య ర్థిగా తెలంగాణ కాంట్రాక్ట్ కార్మిక సం ఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్దెల శ్రీనివాస్ శనివారం సింగరేణి ట్రెనింగ్ సెంటర్‌లో నామినేషన్ దాఖలు చేశారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తరఫున 'సింహం' గుర్తుపై ఆయన పోటీ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్పొరేటర్ అంటే నాయకుడు కాదు.. వార్డు ప్రజలకు సేవకుడని, ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల కోసం సాగించిన పోరాటాల అనుభవంతో వార్డు అభివృద్ధికి అంకితమవుతానని తెలిపారు. వార్డు అభివృద్ధి కోసం తనకు ఓటు వేయాలని ఆయన ప్రజలను కోరారు.

# కుష్టు రహిత సమాజానికి అవగాహన ఆయుధం

**జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ సుధా రాజేంద్ర**

చొప్పదండి ప్రభాతవార్త

చొప్పదండి పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా డాక్టర్ సుధా రాజేంద్ర "స్పర్శ లెప్రసీ అవేర్నెస్ క్యాంపెయిన్" ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. లెప్రసీ రహిత సమాజాన్ని ఆవిష్కరించాలంటే ప్రతి ఒక్కరు కూడా లెప్రసీ వ్యాధి గురించి అవగాహన కలిగి ఉండాలి అని తెలిపారు. నేటి నుండి మొదలుకొని రెండు వారాలపాటు



సమాజం లోని ప్రతి ఒక్కరు కూడా వ్యాధి పై చైతన్యం చేయాలని, తొలి దశలోనే స్పర్శ లేని, రాగి రంగు లేదా తెలుపు రంగులో మచ్చలు గుర్తించి, ప్రభుత్వం ద్వారా ఉచితంగా అందుబాటులో ఉన్న చికిత్సను తీసుకొని అంగ వైకల్యం గురికాకుండా కాపాడాలనీ, లెప్రసీ వ్యాధితో బాధపడుతున్న వారిని ఎలాంటి వివక్ష చూపరాదని ఈ సందర్భంగా సూచించారు.. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనూష వైద్యాధికారి, డాక్టర్ శ్రీ కీర్తన వైద్యాధికారి, డాక్టర్ సురేందర్, సి హెచ్ ఓ వెంకటస్వామి, ప్రకాష్ డి పి ఎం ఓ, జి శ్రీదేవి మహిళా పర్యవేక్షకురాలు, జాకేర్ హుస్సేన్ మగ పర్యవేక్షకులు, సూర్య ల్యాబ్ టెక్నీషియన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది ఆశలు తదితరులు పాల్గొన్నారు.

## సర్వాపూర్ లో పౌర హక్కుల దినోత్సవం

మల్యాల/ ప్రభాతవార్త




మల్యాల మండలం సర్వపూర్ లో శుక్రవారం స్థానిక అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ లో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు, ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ తెగ లపై అంటరానితనం నిర్మూలన, నివారణ, నిరోధక చట్టం పై అవగాహన కల్పించారు, కార్యక్రమంలో మల్యాల రెవెన్యూ ఇన్స్పెక్టర్ తిరుపతి, గ్రామ సర్పంచ్ హనుమంతు, ఏఎస్ఐ మల్లారెడ్డి , పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు

## మానాల శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మొదలైన జాతర

మల్యాల/ ప్రభాతవార్త



మల్యాల మండలం మానాల గుట్టలపై వెలసిన శ్రీ నల్లగుట్ట నరసింహస్వామి ఆలయంలో మూడు రోజులపాటు జరిగే శ్రీ స్వామివారి కళ్యాణ మహోత్సవం సందర్భంగా జరిగే జాతర ప్రారంభమైంది, ఈ సందర్భంగా శుక్రవారం మొదటి రోజు ఉదయం శ్రీ స్వామివారికి నిత్యారాధన , క్షీ రాభిషేకం, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాదం, సాయంత్రం గోదోషి శుభముహూర్తాన శ్రీలక్షి ్మ నరసింహ స్వామి వారి కల్యాణ మహోత్సవం, అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు, 31న శ్రీ స్వామివారికి ఉదయం నిత్యారాధన, ఫల పంచామృతాభిషేకాలు, తీర్థ ప్రసాద వితరణ, ఫిబ్రవరి 1న ఉదయం 9 గంటలకు ఆలయంలో రథోత్సవం జాతర కార్యక్రమం వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఉత్సవ నిర్వాహకులు తెలిపారు, జాతరకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ స్వామివారిని దర్శించుకోవాలని మానాల సర్పంచ్ బల్మూరి పాపారావు కోరారు

## అసిస్టెంట్ లోకోపైలట్ కు అభినందన

రామడుగు ప్రభాతవార్త,



రామడుగు మండలం వెలిచాలకు చెందిన ఎముండ్ల రాజు రైల్వేలో అసిస్టెంట్ లోకోపైలట్ ఉద్యోగం సాధించి ందుకు సర్పంచ్ వీర్ల నర్సింగారావు శుక్రవారం అభినందించారు. రాజు స్థానికంగా ఉన్న సరస్వతి పాఠశాలలో పదో తరగతి వరకు, హైదరాబాద్ లో డిప్లొమా, బీటెక్ పూర్తిచేసి గతేడాది రైల్వే ఉద్యోగానికి ఎగ్జామ్ రాశాడు. ఇటీవలి ఫలితాల్లో రాజు అసిస్టెంట్ లోకోపైలట్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. రాజు ఉన్నతికి కృషిచేసిన తల్లిదండ్రులను జీపీ పాలకవర్గం శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎల్లమ్మల వసంత, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

## జనం అంతా సమ్మక్క జాతర వైపే

**ఘనంగా సమ్మక్క జాతర వేడుకలు జోగిని తో బోనం సమర్పణ**

**భక్తులతో కిక్కిరిసిన జాతర**

**మొక్కులు చెల్లించుకున్న భక్తులు**

చొప్పదండి ప్రభాతవార్త,



తెలంగాణలో ఎంతో ప్రశస్థి కలిగిన సమ్మక్క సారలమ్మ జాతరకు జనం పోటెత్తారు అందరి అడుగులు సమ్మక్క జాతర వైపే సాగాయి. సమ్మక్క సారలమ్మలు గద్దలపై కొలువు కాగా భక్తులు మొక్కులను చెల్లించుకున్నారు అమ్మవార్లకు ఒడిబియ్యం నారికేళం సమర్పించి అమ్మవారి కృపకు పాత్రులు అయినారు భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరారు చొప్పదండి పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి జనం తండోప తండాలుగా తరలివచ్చారు భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా సమ్మక్క సారలమ్మ ఉత్సవ కమిటీ చైర్మన్ చీకట లచ్చయ్య ఆధ్వర్యంలో అందరి సహకారంతో చర్యలను చేపట్టారు భక్తులు ఉదయం నుండి సాయంత్రం వరకు దర్శనాలను చేసుకున్నారు అక్కడనే భోజనాలను వండుకొని మొక్కులు చెల్లించుకున్నారు దారిలో దుమ్ము లేవకుండా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నీటిని చల్లారు దీంతో భక్తులకు ఒకింత ఉపశమనం కలిగింది మండల పరిధిలోని కొలిమికుంట గ్రామానికి చెందిన జోగిని శారద అమ్మవారికి బోనాలను సమర్పించింది అమ్మవారి గద్దల చుట్టూ బోనమెత్తుకొని నృత్యంతో విన్యాసాలను చేస్తూ కొబ్బరికాయలను కొడుతూ అమ్మవారిని కొలుస్తూ బోనాలను సమర్పించింది ఈ సన్నివేశం భక్తులను ఆకట్టుకుంది జనమంతా జాతర వైపు సాగడంతో మధ్యాహ్నం తర్వాత చొప్పదండి పట్టణంలోని ప్రధాన రహదారి నిర్మానుషంగా మారింది మళ్లీ సాయంత్రం రద్దీ నెలకొంది

## బిజెపిలో చేరిన కాంగ్రెస్ నాయకుడు

కోరుట్ల, ప్రభాతవార్త :



కోరుట్ల పట్టణంలోని 26 చెందిన మాజీ కౌన్సిలర్, కాంగ్రెస్ నాయకుడు ఎంబేరి నాగభూషణం నిజామాబాద్ పార్లమెంటు సభ్యుడు ధర్మపురి అరవింద్ ఆధ్వర్యంలో బీజేపీ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎంపీ అరవింద్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలోకి చేరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా బిజెపి అధ్యక్షుడు యాదగిరి బాబు, బిజెపి నాయకులు రుద్ర శ్రీనివాస్, కస్తూరి లక్షీ ్మనారాయణ, డాక్టర్ అనూప్ రావు, ఇందూరి సత్యం, తిరుమల వాసులతో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చొప్పదండి వార్త

## సీఎం కప్ పోటీలలో విద్యార్థులు ప్రతిభ కనబరచాలి

మల్యాల/ ప్రభాతవార్త



విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యత వెలికి తీసేందుకుగాను క్రీడారంగం పట్ల ఆసక్తి చూపేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సీఎం కప్ పోటీల లో విద్యార్థులు తమ ప్రతిభ ప్రదర్శించాలని మల్యాల ఎంఈఓ జయసింహారావు కోరారు, శుక్రవారం మండల స్థాయి సీఎం కప్ క్రీడలను తాటిపల్లి గురుకులం పాఠశాలలో రెండవ రోజు బాలురలకు నిర్వహించారు, ఇక్కడ జరుగుతున్న పోటీలలో విద్యార్థులు నియోజక వర్గస్థాయి పోటీలకు ఎంపిక కావాలని, తద్వారా జిల్లా రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించబడతాయని అన్నారు, వ్యాయామ ఉపాధ్యాయులు విశ్వప్రసాద్, అంజయ్య, బాబా లక్షి ్మ, గంగాసాగర్, శేఖర్, మధులిక, రమేష్, అనిల్, నవీన్, సాయి, శ్రీకాంత్, మహేష్ పాల్గొన్నారు,

## సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక పండుగలు

**ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**

గంగాధర,ప్రభాత వార్త:



సంస్కృతికి సాంప్రదాయాలకు పండుగలు ప్రతీక గా నిలుస్తాయని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. గంగాధర మండలం మధురానగర్, బూరుగుపల్లిలో గ్రామాల్లో నిర్వహిస్తున్న సమ్మక్క, సారలమ్మ జాతరలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతర కమిటీ నిర్వాహకులు ఎమ్మెల్యేకు సాదర స్వాగతం పలికారు. సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మండల ప్రజలు జాతరను ప్రశాంతంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. మధురానగర్, బూరుగుపల్లి లో సమ్మక్క సారలమ్మ జాతర అభివృద్ధికి సాకారం అందజేస్తామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ వేముల భాస్కర్, ఉప సర్పంచ్ తూం రాజు, అంజి, సాగి అజయ్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## గుమ్లాపూర్ లో పౌర హక్కుల దినోత్సవం

చొప్పదండి ప్రభాతవార్త,

చొప్పదండి మండలం లోని గుమ్లాపూర్ గ్రామం లో పౌరహక్కుల దినోత్చవం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ తహసీల్దార్ మన్మిత్ సింగ్ గిర్దావర్, గ్రామపాలనధికారి, గ్రామ. సర్పంచ్ , మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ మునిగాల రాజేందర్ వార్డు సభ్యులు, అంబేద్కర్ సంఘ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## సనుగుల గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం

చందుర్తి ప్రభాతవార్త:



చందుర్తి మండలం సనుగుల గ్రామంలో శుక్రవారం పౌర హక్కుల దినోత్స వం( సివిల్ రైట్స్ డే) కార్యక్రమాన్ని నిర్వహించారు, ఈ సందర్భంగా రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ కుల వివక్షతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు, గ్రామాల్లో కుల వివక్షత చూపిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు, గ్రామాల్లో అంటరానితనం గురించి కుల బహిష్కరణ జరుగుతే అధికారులకు సమాచారం అందించాలన్నారు, ఈ సందర్భంగా అంటరానితనంకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు, ఈ కార్యక్రమంలో సర్పంచి బొడిగే లావణ్య అనిల్, ఉపసర్పంచి స్వామి, ఏఎస్సై ఆనంద్ వార్డు సభ్యులు రామిని సాయి గ్రామస్తులు పాల్గొన్నారు.

## విద్యార్థులు దేశ రక్షణలో ముందుండాలి

చందుర్తి జనవరి 30: ప్రభాతవార్త:



విద్యార్థులు దేశ రక్షణలో ముందుండాలని సికింద్రాబాద్ ఆర్మీ నియమక అధికారి అన్నారు. చందుర్తి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆర్మీ పై శిక్షణ, ఆర్మీ రిక్రూటింగ్ ఆఫీస్ సికింద్రాబాద్ వారి ఆధ్వర్యంలో ఆర్మీ పై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఆర్మీ పరీక్షకు ఏ విధంగా సిద్ధం కావాలి ఎంత వయసు ఉండాలి, పరీక్షకు సంబంధించిన ప్రణాళిక పై అవగాహన కల్పించారు. దేశ భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉందన్నారు. ప్రతి ఒక్కరూ దేశ సేవ చేయడానికి సిద్ధంగా ఉండాలని, అందుకు దేశ రక్షణలో భాగంగా ముందుకు రావాలని, ప్రొజెక్టర్ ద్వారా ప్రత్యక్షంగా విద్యార్థులకు తెలిపారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి ృ అధ్యాపక బృందం, ఆర్మీ అధికారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఫిజీషయన్ల జాతీయ సదస్సులో ప్రసంగిస్తున్న జగిత్యాల డాక్టర్ శంకర్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:







బీహార్ రాజధాని పాట్నా లో జరుగుతున్న అఖిల భారత ఫిజీషయన్ల సదస్సు లో జగిత్యాల ప్రముఖ వైద్యులు డాక్టర్ శంకర్ ' శ్వాసకోశ ఉబ్బస వ్యాధులు ఆధునిక చికిత్సా పద్ధతులు ' పై ప్రసంగించారు. శ్వాస సంబంధిత సమస్యలు సంక్రమించే తీరు, వర్గీకరణ, నిర్ధారణ పరీక్షలు మరియు ఆధునిక చికిత్స లపై డాక్టర్ శంకర్ సవివరంగా అవగాహన కల్పించారు . మారుమూల ప్రాంతం జగిత్యాల లో అనేక యేళ్ళ నుండి వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ శంకర్ గారిని జాతీయ స్థాయిలో గుర్తించి జాతీయ వేదిక పై ప్రసంగించాల్సిందిగా ఆహ్వానించి సన్మానించడం మరియు ప్రసంగించిన తీరుపై దేశం నలుమూలల నుండి అధిక సంఖ్యలో పాల్గొన్న వైద్యులు హర్షం తెలియజేస్తూ డాక్టర్ శంకర్ గారిని ఎంతగానో అభినందించారు.

## విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

చందుర్తి ప్రభాతవార్త:





విద్యార్థులు క్రీడల్లో రాణించాలని చందుర్తి మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాధ అన్నారు. చందుర్తి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల క్రీడా మైదానంలో సీఎం కప్ పోటీలను ఎంపీడీవో రాధ ,సీఐ వెంకటేశ్వర్లు, సర్పంచ్ పులి సత్యం మండల విద్యాధికారి వినయ్ కుమార్ తో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడల్లో మరింత పాలించాలన్నారు, చదువుతోపాటు క్రీడల్లో ప్రతిభ కనబరిస్తే ప్రభుత్వ ఉద్యోగాల్లో అవకాశాలు ఉంటాయన్నారు, క్రీడల్లో గెలుపు ఓటములు సమానంగా స్వీకరిస్తూ క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై జిల్లెల రమేష్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఐఎంఏ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

జగిత్యాల టౌన్-ప్రభాతవార్త:








రక్తదాతల సహకారంతో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తు న్నప్పటికీ ఇంకా రోగులకు రక్తం కొరత తీరటం లేదని దాని కొరకు మరింత మంది రక్త దాతలు ముందుకు రావాలని ఐఎంఏ జగిత్యాల శాఖ అధ్యక్షులు డాక్టర్ గూడూరి హేమంత్ పిలుపు నిచ్చారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఐఎంఏ హాల్లో ఐఎంఏ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి రక్తదాతలే రేపటి ప్రాణదాతలను కొనియాడారు. డిప్యూటీ డియంహెచ్ వో డాక్టర్ నీలారపు శ్రీనివాస్ మాట్లాడుతూ రక్తదాతల సహకారంతో రోగులకు రక్తం కొరత లేకుండా ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి రక్తదానం చేయాలని కోరారు. ఐఎంఏ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆకుతోట శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఐఎంఏ ఆధ్వర్యంలో ప్రతి మాసం చివరి వారంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నామని రక్త దాతలు అధిక సంఖ్యలో పాల్గొని రక్తం కొరత తీరుటకు కృషి చేయాలని కోరారు. ఈ శిబిరంలో 18 మంది జగిత్యాల గ్రామీణ మరియు పట్టణ ప్రాంతం ప్రజలు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ కోశాధికారి డాక్టర్ కోటగిరి సుధీర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి

### -ఎంపీడీవో సుమంత్

బుగ్గారం ప్రభాతవార్త:

బుగ్గారం క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని మండల అభివృద్ధి అధికారి సుమంత్ పేర్కొన్నారు. సీఎం కప్పు సెకండ్ ఎడిషన్ క్రీడలను శుక్రవారం రోజున ప్రారంభించారు. పీడీ అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో క్రీడాకారులతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలనిబి కోరారు. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ అఫ్జల్ మియా, ప్రధానోపాధ్యాయులు మోహన్ రెడ్డి, సిఆర్పి పురుషోత్తం పాల్గొన్నారు.



# వేములవాడ వార్త

## బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

### -తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ విజయ్

చందుర్తి ప్రభాతవార్త:



తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సేవలను సద్విని చేసుకోవాలని బ్యాంక్ మేనేజర్ గుడిసె విజయ్ అన్నారు, చందుర్తి తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్థిక, అక్షరాస్యత, బ్యాంకు సేవలపై కళాజాత ప్రదర్శన నిర్వహించారు, ఈ సందర్భంగా మేనేజర్ విజయ్ మాట్లాడుతూ తెలంగాణ గ్రామీణ బ్యాంకు సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు, రైతులకు వ్యవసాయ రుణాలు, గృహ నిర్మాణ రుణాలు, మహిళా సంఘాలకు పావుల వడ్డీ రుణాలతో పాటు, వడ్డీ లేని రుణాలను అందజేయడం జరుగుతుందన్నారు, అలాగే దీర్ఘకాలిక రుణాలు, స్వయం ఉపాధి రుణాలను అందిస్తున్నట్లు తెలిపారు, ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించేందుకు తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందన్నారు, ఈ కార్యక్రమంలో బ్యాంకు అకౌంట్ నీత, ఫీల్డ్ ఆఫీసర్ గంగా శేఖర్, క్యాషియర్ అజయ్, బ్యాంకు సిబ్బంది సంతోష్, అపర్ణ, లత, రవళి వినియోగదారులు పాల్గొన్నారు.

## క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి

### -మార్కెట్ చైర్మన్ ఎల్లయ్య

ప్రభాతవార్త కొనరావుపేట:





క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని నిజామాబాద్ మార్కెట్ చైర్మన్ కచ్చకాయలు ఎల్లయ్య అన్నారు శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న సీఎం కప్ అట్లాంటిక్ ఆటల పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పల్లెల నుండి ప్రపంచ స్థాయికి క్రీడాకారులు ఎదగడానికి వారి నైపుణ్యాన్ని ప్రపంచానికి తెలియజేయడానికి సీఎం కప్ క్రీడా పోటీలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారని క్రీడలు శరీర ద్రుడుధ్యాన్ని పెంచడమే కాక అన్ని రంగాల్లో దోహదపడతాయని విద్యతో పాటు క్రీడల్లో రాణించి ప్రపంచ స్థాయికి ప్రతి క్రీడాకారులు ఎదగాలని అన్నారు ఈ కార్యక్రమంలో ఎస్సై ప్రశాంత్ రెడ్డి సర్పంచ్ కాశీరాం మార్కెట్ వైస్ చైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్ ఎంపీడీవో స్నిగ్ధ రెడ్డి ఎంఈఓ మురళి నాయక్ మార్కెట్ డైరెక్టర్లు ప్రభాకర్ రెడ్డి మందాల లింబయ్య నాయకులు జింక కరుణాకర్ బోయిని లింబయ్య రాస రవీందర్ రెడ్డి ఎస్ జి ఓ సంతోష్ పీటీలు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు

# అంటరానితనం నిర్మూలించడం అందరి బాధ్యత

## రెవెన్యూ ఇన్స్పెక్టర్ రవిశంకర్

రామగిరి ప్రభాతవార్త:

అంటరానితనం నిర్మూలించడం అందరి బాధ్యత అని రామగిరి మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ గడ్డం రవిశంకర్ అన్నారు. శుక్రవారం రామగిరి మండలం చందనాపూర్ గ్రామంలో తాసిల్దార్ సుమన్ ఆదేశాల మేరకు పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమం స్థానిక సర్పంచ్ కొండా మంజుల శ్రీనివాస్ పటేల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఒకరి తక్కువ ఒకరిది ఎక్కువ కుల మత బెద తారతమ్యాలు లేకుండా అందరూ కలిసి మెలిసి జీవించాలని, రెండు గ్లాసుల విధానానికి స్వస్తి పలకాలని, గ్రామాలలో కులమతాలను ప్రేరేపిస్తే వారిపై చట్టరీత్యా



చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టూ టౌన్ ఎస్ఐ ఎండి హైమదుల్లా, పంచాయతీ కార్యదర్శి, సునీల్, వార్డ్ మెంబర్లు, కుమ్మరి స్వామి, వెంకటేష్, భోగే రాజు, తదితరులు పాల్గొన్నారు.

## చివరి రోజు జోరుగా నామినేషన్లు 98నామినేషన్ల స్వీకరణ

మంథని ప్రభాతవార్త;



మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల చివరి రోజు మంథని మున్సిపల్ పరిధిలో 92 నామినేషన్ దాఖలు అయ్యాయి.చివరిరోజు శుక్రవారం సాయంత్రం ఏడు గంటల వరకు అభ్యర్థులు క్యూలో ఉండి నామినేషన్లు దాఖలు చేశారు. 92మంది నామినేషన్లు వేయగా, మొత్తం158 నామినే షన్లను అభ్యర్థులు వేసినట్లు మంథని మున్సిపల్ కమిషనర్ ఎన్.మనోహర్ తెలిపారు.

## తురకల మద్దికుంట జాతరలో ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవలు

పెద్దపల్లి, ప్రభాతవార్త:



పెద్దపల్లి జిల్లా తురకల మద్దికుంట గ్రామంలో అత్యంత వైభవంగా జరుగుతున్న శ్రీ సమ్మక్కసారలమ్మ జాతరలో ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఆదర్శంగా నిలిచారు. గత రెండు రోజులుగా జాతరలో భక్తులకు సేవలందించడంలో విద్యార్థులు చురుకైన పాత్ర పోషించారు. జాతరకు పోటెత్తిన భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, ఆలయ పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం, క్యూ లైన్లలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా క్రమబద్ధీకరించడం వంటి పనులను వాలంటీర్లు నిర్వహించారు. భక్తులకు అవసరమైన సూచనలు ఇస్తూ, రాకపోకలకు ఆటంకం కలగకుండా సహాయ సహకారాలు అందించారు. పరిశుభ్రతపై భక్తులకు అవగాహన కల్పించడంలో వాలంటీర్లు చూపిన ఉత్సాహాన్ని చూసి ప్రజలు ప్రశంసలు కురిపించారు. సమాజ సేవే లక్ష్యంగా ట్రినిటీ ఇంజనీరింగ్ ఎన్ఎస్ఎస్ యూనిట్ భవిష్యత్తులోనూ ఇలాంటి మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సేవా కార్యక్రమంలో ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ మణి గణేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రాజేందర్, చంద్రశేఖర్, ఇతర అధ్యాపకులు, వాలంటీర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ముగిసిన నామినేషన్ల పర్వం....

తొర్రూరు జనవరి 30 ప్రభాతవార్త

మున్సిపాలిటీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా గత మూడు రోజులుగా స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థుల నామినేషన్లు వేశారు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్ తెలిపిన వివరాల ప్రకారం తొర్రూర్ మున్సిపాలిటీలో 16 వార్డులకు మొత్తం నామినేషన్లు 144 దాఖ లయ్యాయని తెలిపారు కాంగ్రెస్ 41,బిఆర్ఎస్ 51, బిజెపి 32,బీఎస్పీ 3,సిపిఎం 5, ఇతర పార్టీలు 4, స్వతంత్ర అభ్యర్థులు 8 అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారని తెలిపారు నామినేషన్ల గడువు పూర్తయిందని కమిషనర్ తెలిపారు

## ముత్తారం మండల ప్రజలు చల్లగా ఉండాలి

### -జాతరలో కొలువుదీరిన తల్లులను వేడుకున్న కాంగ్రెస్ యువ నాయకుడు

ముత్తారం, ప్రభాతవార్త:



ముత్తారం మండలంలోని ఖమ్మంపల్లి పంచాయతీ పరిధిలో గల సందరెల్లి గ్రామ సమీపంలో వైభవంగా జరుగుతున్న శ్రీ సమ్మక్కసారలమ్మ జాతరను కాంగ్రెస్ యువ నాయకుడు జక్కుల సాయి గౌడ్ శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు మొక్కులు చెల్లించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండల ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, వన దేవతల ఆశీస్సులు అందరికీ కలగాలని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూజారులు సురపాక నాగబాబు, గుర్రం లక్ష్మణ్, రాజ సమ్మయ్య, పిట్టల శ్రీకాంత్, సుశాంత్, బద్రి, లక్షి ్మ మల్లక్క, బాబురావుతో పాటు జాతర నిర్వాహకులు పర్ష ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

## వనదేవతల దీవెనలు ప్రజలపై ఉండాలి

### మొక్కలు చెల్లించుకున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

మానకొండూర్, ప్రభాతవార్త:

సమ్మక్క సారలమ్మ వన దేవతల తల్లుల దీవెనలు ప్రజలపై ఉండాలని మానకొండూరు ఎమ్మెల్యే, రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ వేడుకున్నారు. శుక్రవారం మండలంలోని కొండపల్కల, లింగాపూర్, దేవంపల్లి, నీరుకుల వేగురుపల్లి గ్రామాలలో సమ్మక్క సారలమ్మ జాతర అత్యంత వైభవంగా కన్నుల పండుగగా జరిగింది. కొండపల్కల గ్రామంలో నిర్వహించిన సమ్మక్క సారలమ్మ జాతరలో మానకొండూరు ఎమ్మెల్యే వనదేవతలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణలో రెండేళ్ల ఒక్కసారి అత్యంత వైభవంగా కొనసాగే సమ్మక్క సారలమ్మ జాతర అన్నారు. భక్తులు కోరిన కోరికలను తీర్చే అత్యంత మహిమగల దేవతలు సమ్మక్క సారలమ్మ అని భక్తుల నమ్మకం. వనదేవతల దీవెనలతో రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండేలా దీవించు తల్లి అంటూ వేడుకున్నట్లు తెలిపారు. మండల ప్రజలు కుటుంబ సభ్యులతో కలిసి వనదేవతల జాతరకు పలు వాహనాలలో వేలాది మంది తరలి వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాడ లక్ష్మీ తిరుపతి రెడ్డి, మండల అధ్యక్షుడు రవీంద్ర చారి, మార్కెట్ చైర్మన్ ఓదెలు, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్ల పెల్లి సంపత్ గౌడ్, జాతర కమిటీ చైర్మన్ కే .శ్రీనివాస్ రెడ్డి, పొలసాని దేవేందర్రావు, చంద్రయ్య గౌడ్, సర్పంచులు పెంచాల కిషన్ రావు , బుర్ర శ్రీధర్ గౌడ్, పడాల సత్యనారాయణ గౌడ్, మండల కాంగ్రెస్ నాయకులు నాగిశెట్టి రాజయ్య, దూలం దేవేంద్ర వీరస్వామి, రేమిడి శ్రీనివాస్ రెడ్డి, కొండ్ర సురేష్, నలగొండ రాములు, మందల రమ, గట్టు తిరుపతి, నల్లగొండ కొమురెల్లి, తిరుపతి గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



# మంథని వార్త

## మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి సత్తా చాటుతాం

మంథని ప్రభాతవార్త;



మంథని మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి పార్టీ 13 స్థానాల్లో పోటీ చేసి సత్తా చాటుతామని బిజెపి రాష్ట్ర నాయకులు హేమాజీ అన్నారు. శుక్రవారం పట్టణంలోని బిజెపి కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు గట్టు రాధాకృష్ణ బిజెపిలో చేరగా ఆయనకు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ ద్వారానే మున్సిపాలిటీ అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ ప్రాంత ప్రజలు బిజెపి అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమానికి పట్టణ అధ్యక్షులు సబ్బని సంతోష్ అధ్యక్షత వహించగా మున్సిపల్ ఎన్నికల ఇన్చార్జి కొండపాక సత్యప్రకాష్, రాపర్తి సంతోష్, చిలువరి సతీష్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

## ఐదవ వార్డు బరిలో యువ న్యాయవాది సహేందర్ రెడ్డి

మంథని ప్రభాతవార్త:



మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా మంథని మున్సిపల్ పరిధిలోనీ ఐదవ వార్డులో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా యువ న్యాయవాది ముస్కుల సహేందర్ రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు ఆయన నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీ మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో 5వ వార్డు పరిధిలోని అన్ని ప్రాంతాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసే విధంగా కృషి చేస్తానని ఆయన అన్నారు. తనకు వార్డు పరిధిలోని అన్ని వర్గాల వారు సహకరించి గెలిపించాలని ఆయన కోరారు. ఆయన వెంట మంథని మండల యాదవ సంఘం అధ్యక్షుడు పర్షవేన మోహన్ యాదవ్, జిల్లా కిసాన్ సెల్ చైర్మన్ ముస్కుల సురేందర్ రెడ్డి తో పాటు పలువురు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ పైప్ లైన్ పనులను ప్రారంభించిన సర్పంచ్

రామగిరి ప్రభాతవార్త:

రామగిరి మండలం కల్వాచర్ల గ్రామంలో శుక్రవారం మిషన్ భగీరథ పైప్ లైన్ పనులను సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి ఆధ్వర్యంలో ప్రారంభించారు. గ్రామంలో గత కొన్ని సంవత్సరాలుగా నీటి సమస్యతో బాధపడుతున్న ప్రజల దాహు ర్తి తీర్చడం కోసం, రానున్న వేసవిలో నీటి ఎద్దడి లేకుండా అధికారులతో సంప్రదించి మిషన్ భగీరథ పైప్ లైన్ పనులను ప్రారంభించడం జరిగిందని సర్పంచ్ శారద తెలిపారు.



# ముగిసిన మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ

## 75 మంది అభ్యర్థులు, 113 నామినేషన్లు

ధర్మపురి, ప్రభాతవార్త:

మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా గత మూడు రోజులుగా నిర్వహించిన నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం ముగిసింది. మున్సిపల్ పరిధిలోని 15 వార్డులకు గాను వివిధ పార్టీకు చెందిన అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థులు కలిసి 75 మంది 113 నామినేషన్లను దాఖలు చేశారు. ఉదయం నుండి సాయంత్రం వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగగా, నామినేషన్ కేంద్రాన్ని జనరల్ అబ్జర్వర్ ఖర్కడే కాళీ చరణ్ సుధామ రావు పరిశీలించారు. జగిత్యాల డి.ఎస్.పి రఘు చందర్ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ అధికారులు బందోబస్తు నిర్వహించారు.



అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లను శనివారం పరిశీలించి, వివరాలను వెల్లడిస్తామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రావు తెలిపారు.

## జాతీయస్థాయి కబడ్డీలో పీడి రమ్యకు గుర్తింపు

చిగురుమామిడి, ప్రభాతవార్త:



చిగురుమామిడి మండలం ముల్కనూర్ మోడల్ స్కూల్ లో ఫిజికల్ డైరెక్టర్ గా పనిచేస్తున్న రమ్య జాతీయ స్థాయిలో విశేష ఘనతను సొంతం చేసుకున్నారు. రమ్య స్వస్థలం సిద్దిపేట జిల్లా కోహెడ మండల కేంద్రానికి చెందిన నివాసి. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో జనవరి 27 నుంచి 30 వరకు నిర్వహించిన 72వ సీనియర్ నేషనల్ చాంపియన్‌షిప్ కు వీరు రిఫరీగా ఎంపికయ్యారు. ఈ ప్రతిష్టాత్మక జాతీయ పోటీలకు రిఫరీగా ఎంపిక కావడం రమ్య క్రీడా పరిజ్ఞానం, అనుభవం, నిబద్ధతకు నిదర్శనమని క్రీడా వర్గాలు కొనియాడాయి. గత కొన్నేళ్లుగా కబడ్డీ రంగంలో క్రీడాకారులకు శిక్షణ ఇవ్వడమే కాకుండా రిఫరీగా కూడా రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో తన ప్రతిభను చాటుకుంటూ వస్తున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ హర్జిత్ కౌర్ మాట్లాడుతూ రమ్య జాతీయ స్థాయిలో రిఫరీగా ఎంపిక కావడం తమ పాఠశాలకు గర్వకారణమని, ఆమె కృషి, క్రమశిక్షణ విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థాయిలను వారు అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నామని తెలిపారు. టీజీఎంఎస్ ముల్కనూరు యాజమాన్యం, అధ్యాపక బృందం, విద్యార్థులు హృదయపూర్వకంగా ఫిజికల్ డైరెక్టర్ రమ్యను అభినందిస్తూ ఈ విజయం పాఠశాల క్రీడా రంగానికి మరింత గుర్తింపును తీసుకువస్తుందని అన్నారు.

## అందుబాటులో ఉండనున్న జనరల్ అబ్జర్వర్ ఖర్టాడే కాళీచరణ్ సుదామా రావు

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:



రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో జగిత్యాల జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకులుగా ఖర్టాడే కాళీచరణ్ సుదామ రావు ఐఏఎస్ జగిత్యాల జిల్లాకు నియమించబడగా జగిత్యాల లోని అతిథి గృహంలో సోమవారం నుండి శుక్ర వారం వరకు ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు అందుబాటులో ఉంటారని ప్రజలు, ప్రజా ప్రతినిధులు ఎవరైనా ఎన్నికలకు సంబంధించి ఏవైనా అంశాలు మరియు విషయాల గురించి అతిథి గృహంలో నేరుగా సంప్రదించవచ్చని తెలిపారు. లేదా ఫోన్ లో 7972697600 సంప్రదించగలరని తెలిపారు.

## తాళ్ల ధర్మారం లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోదాం ప్రారంభం

బీర్పూర్ ప్రభాతవార్త:



జగిత్యాల జిల్లా బీర్ పూర్ మండలం లోని తాళ్ల ధర్మారం గ్రామం లో వ్యవసాయ అధికారి తిరుపతి, పాక్స్ సీఈవో రాజేందర్ ఆధ్వర్యంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోదామును ప్రారంభించారు. స్థానిక సర్పంచ్ చల్ల వినోద లక్ష్మణ్. చిత్రవేణి గూడెం సర్పంచ్ చిక్రమ్ మారుతీ. కమ్మునుర్ సర్పంచ్ తోట శ్రీనివాస్. ఏఎంసి డైరెక్టర్ ఏనుగు జోగిరెడ్డి. మాజీ సర్పంచ్ లు నల్ల మహిపాల్ రెడ్డి, నారపాక రమేష్ ల కృషితో ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్న గోదాం కళ నెరవేరిందని ఆయా గ్రామాల ప్రజలు రైతులు ఆనందంతో గోదం ఏర్పాటుకు కృషి చేసినటువంటి అధికారులకు నాయకులు రైతులు ధన్యవాదములు ఈ కార్యక్రమంలో జూపెల్లి మల్లేష్ మరియు వార్డ్ మెంబెర్స్ సత్యం రెడ్డి. శ్రీనివాస్. శేఖర్. నర్సింగ్. జగదీష్ , పిఏసిఎస్ మాజీ డైరెక్టర్ లు, సత్యనారాయణ. నడిపిరాజాం. రైతులు పాల్గొన్నారు..

## నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన జనరల్ అబ్సర్వర్ ఖర్టాడే కాళీచరణ్ సుదామా రావు

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త;



రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జగిత్యాల జిల్లాకు నియమితులైన ఎన్నికల జనరల్ అబ్సర్వర్ ఖర్టాడే కాళీచరణ్ సుదామా రావు శుక్రవారం జగిత్యాల మున్సిపాలిటీలలో జరుగుతున్న నామినేషన్ ల సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల జనరల్ అబ్సర్వర్ ఖర్టాడే కాళీచరణ్ సుదామా రావు మాట్లాడుతూఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు అందరు ఎన్నికల నియమావళి మేరకు తమ విధులు నిర్వర్తించాలని అలాగే నామినేషన్ కేంద్రాల వద్ద అన్ని పత్రాలు నింపడం, సరైనా ధ్రువీకరణ పత్రాలు వంటివి రిటర్నింగ్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలంచాలని రిటర్నింగ్ అధికారులకు సూచించారు. నామినేషన్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ ను ఉపయోగించుకునేలా సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. పోటీ చేసే అభ్యర్థులు నిర్దేశించిన వ్యయ పరిమితి మేరకు ఖర్చులు చేయాలని అందుకు ప్రత్యేక బ్యాంక్ ఖాతా తీసుకోవాలని తెలిపారు. ఫ్లయింగ్ స్కాడ్, ఎఫ్ ఎస్ టి, ఎస్ ఎస్ టి టీములు తమ విధులు జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు. ఎన్నికల్లో నియమితులైన సిబ్బంది ఎన్నికల నియమావళి ప్రకారం తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన అన్ని రకాల మౌలిక సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. అధికారులందరూ సమన్వయంతో ఎన్నికల విధులు జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమం లో ఆర్డిఓ స్పెషల్ ఆఫీసర్ మధు సూదన్, మున్సిపల్ కమిషనర్ లు, తహసీల్దార్ లు, సహాయ ఎన్నికల వ్యయ పరిశీలకులు, రిటర్నింగ్ అధికారులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ముగిసిన నామినేషన్ల పర్వం....

తొర్రూరు జనవరి 30 ప్రభాతవార్త

మున్సిపాలిటీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా గత మూడు రోజులుగా స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థుల నామినేషన్లు వేశారు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్ తెలిపిన వివరాల ప్రకారం తొర్రూర్ మున్సిపాలిటీలో 16 వార్డులకు మొత్తం నామినేషన్లు 144 దాఖ లయ్యాయని తెలిపారు కాంగ్రెస్ 41, బిఆర్ఎస్ 51, బిజెపి 32, బీఎస్పీ 3, సిపిఎం 5, ఇతర పార్టీలు 4, స్వతంత్ర అభ్యర్థులు 8 అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారని తెలిపారు నామినేషన్ల గడువు పూర్తయిందని కమిషనర్ తెలిపారు

# ధర్మపురి వార్త

## సమ్మక్క సారలమ్మ జాతరకు తరలి వచ్చిన భక్తజనం

ధర్మపురి, ప్రభాతవార్త:



ధర్మపురి క్షేత్ర శివారుణ నిర్వహిస్తున్న సమ్మక్క సారలమ్మ జాతర ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుండి భక్తులు శుక్రవారం తరలివచ్చారు. స్థానిక భక్తులతో పాటు వివిధ ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి, సమ్మక్క, సారలమ్మలను దర్శించుకొని మొక్కులు చెల్లించు కున్నారు. భక్తులు బెల్లాన్ని సమర్పించి, జంతువులను బలిచ్చారు. ఉదయం నుండి సాయంత్రం వరకు భక్తుల సందడి కనిపించింది.

## మా పట్టా భూమిలోనే సమ్మక్క జాతర నిర్వహిస్తున్నాం

వీణవంక, ప్రభాత వార్త:

మా తాతగారైన స్వర్గీయ పాడి సుధాకర్ రెడ్డి, మా పెద్ద నాన్న పాడి రామకృష్ణ రెడ్డి లు 48 సంవత్సరాల సమ్మక్క జాతర నిర్వహిస్తుంటే, ఆ భూమి ఎండో మెంట్ దేనని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అడ్డుకోవడంతో, మేము హైకోర్టు ను ఆశ్రయించడంతో తిరిగి కోర్టు ఉత్తర్వుల మేరకే సమ్మక్క జాతర మా తాత కుటుంబ సభ్యులమే నిర్వహిస్తున్నందున ఎమ్మెల్యే కోర్టు తీర్పును దిక్కరించినందునే పోలీసులు అరెస్టు చేశారని జాతర చైర్మన్ పాడి ఉదయ్ నందన్ రెడ్డి అన్నారు. శుక్రవారం వీణవంక మండల కేంద్రంలోని జాతర చైర్మన్, నిర్వాహకులు పాడి ఉదయ్ నందన్ రెడ్డి తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశములో ఆయన మాట్లాడుతూ... ఈ సమ్మక్క జాతరను మా తాత 1976 లో జాతరను ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి స్థలములో నిర్వహించారు. వారు ఆక్షేపణ తెలపడంతో మా పట్టుభూమి లోనే మా పెద్ద నాన్న కృష్ణా రెడ్డి నిర్వహించగా, అతను వృద్ధాప్యం కారణంగా గత 20 సంవత్సరాల నుండి జాతర నిర్వహిస్తున్నామని, ఈ జాతర చుట్టూ ప్రక్కల గ్రామాలైన లస్మక్కపల్లి, రామకృష్ణాపూర్, బేతిగల్, కనపర్తితో పాటు ఛత్తీస్‌ఘఢ్, మహారాష్ట్ర, సింగరేణి, హైదరాబాద్ లాంటి ప్రాంతాల్లో నుండి భక్తులు సమ్మక్క జాతర కు వస్తుంటారని అన్నారు. దీన్ని చరిత్రలో మిగిలే పోయే విధంగా మినీ మేడారంగా తీర్చిదిద్దాలని ప్రయత్నములో ఉన్నానని అన్నారు. గురువారం సమ్మక్కను గద్దె తీసుకొస్తున్న క్రమంలో ఎమ్మెల్యే ఇంటి ముందు ఆపమన్నారు. అక్కడ మొక్కలు చెల్లించుకోవాల్సి పోయి, గద్దె కు రాని సమ్మక్క గద్దె లపై నిలుచుండడం దైవ దర్శనానికి అనైతికమన్నారు. ఆయన మొక్కలు చెల్లించుకోవాలంటే సారలమ్మ గద్దెకు వచ్చి మొక్కలు చెల్లించుకోవాలి కదా అన్నారు. ఈ లాంటి శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందనే ఉద్దేశ్యముతో నే జాతర సక్రమంగా జరిగేందుకు హైకోర్టు ఉత్తర్వును రాష్ట్ర డిజిపి, ఎండో మెంట్ కమిషనర్ లకు అందించానని అన్నారు. దౌర్జన్యంగా సమ్మక్క గద్దెలేక్కడం ఎమ్మెల్యే శాంతి భద్రతలకు విఘాతం కలిగించినందునే అరెస్ట్ చేశారని అన్నారు. 2022 సంవత్సరములో అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వంలో జాతర నిర్వహించాడు. కానీ నీ మీద ఆశలతో ఎదురు చూస్తున్న నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. మాతాత స్వర్గీయ సుధాకర్ రెడ్డి, మా పెద్దనాన్న కృష్ణా రెడ్డిల పేరుతోనే అప్పటి ముఖ్య మంత్రి పదవులిచ్చాడని వ్యాఖ్యానించాడు.

### -- దళిత సర్పంచ్ ను అవమాన పరచలేదు...

నాకు జాతర నిర్వహణ ఉత్తర్వులు రావడంతో సమయం సమీపిస్తున్న సమయములో జాతర ఎండోమెంట్, స్థానిక ఎస్ఐ ఆవుల తిరుపతి, నా వ్యక్తిగత సహాయకుడు నారాయణ లతో జాతరకు రావాలని సర్పంచ్ దాసారపు సరోజన రాజేంద్రప్రసాద్ కు ఫోన్ లు చేయించామని తర్వాత చెపుతున్నారు. నేను స్పందించకపోవడములో వాస్తవం లేదన్నారు. ఈ సమావేశములో సర్పంచులు దాసారపు సమ్మయ్య, శ్రీవేణి, మాజీ జడ్పీటీసీ దాసారపు ప్రభాకర్, మాజీ విండో చైర్మన్ గంగాడి తిరుపతి రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎక్కేటి రఘుపాల్ రెడ్డి తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బీర్‌పూర్ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కళ్యాణోత్సవం..

- హాజరైన ఎమ్మెల్యే సంజయ్ కుమార్, డీఎస్పీ రఘు చందర్ దంపతులు

ప్రభాతవార్త బీర్‌పూర్ :





జగిత్యాల జిల్లా బీర్ పూర్ మండలంలోని అతిపెద్ద పుణ్యక్షేత్రం శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రోజున స్వామి వారి కళ్యాణం కన్నుల పండుగగా అంగరంగ వైభవంగా నిర్వహించారు. కళ్యాణ మండపం నందు వేద పండితుల మంత్రోచ్చారణలతో శ్రీ లక్ష్మీనరసింహస్వామి, లక్ష్మీ సమేత కళ్యాణ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆలయ అధికారి స్వామివార్లకు, డీఎస్పీ రఘు చందర్ దంపతులు, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు రాజగోపాల్ రావు, ఎండోమెంట్ చైర్మన్ శ్రీనివాస్, సర్పంచ్ సుశీలల్ స్రృజన పట్టు వస్త్రాలను సమర్పించారు. స్వామివారి కళ్యాణోత్సవానికి బ్రహ్మోత్సవ వేడుకలలో భాగంగా ఆదివారం జరిగిన కళ్యాణోత్సవ వేడుకలలో కళ్యాణోత్సవం జరుగుతున్నంత సేపు భక్త జనం మమేకమై తిలకించి పులకించిపోయారు. వేద పండితులు ప్రధాన అర్చకులు సంతోషాచార్యులు, చిన్న సంతోష్ ఆచార్యులు, మధు కుమార్ ఆచార్యులు, సంజయ్ కుమార ఆచార్యులు స్వామి వార్ల పెళ్లి వేడుకలను శాస్త్రోక్తంగా, జీలకర్ర బెల్లం, తాళితంతు, ముత్యాల తలంబ్రాలు, కార్యక్రమాలను సంప్రదాయ పద్ధతిలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీ బీర్పూర్ లక్ష్మీ మ్రనరసింహస్వామి గోవిందా గోవిందా అంటూ లక్ష్మీ నరసింహ స్వామి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. భక్తులు మొక్కులను పెట్టుకొని కళ్యాణం తనివితీరా చూసి ఆనందించి దైవ దర్శనం చేసుకుని పిల్లాపాపల గోడ్డు గోధలు చల్లగా ఉండాలని కోరుకున్నారు. బ్రహ్మోత్సవాలలో భాగంగాజగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, డి.ఎస్.పి రఘుచంద్ర దంపతులు కళ్యాణం సమయంలో స్వామివారిని దర్శించుకుని పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కళ్యాణోత్సవంకు విచ్చేసిన భక్తుల సౌకర్యార్థం డీఎస్పీ రఘు చందర్, సిఐ సుధాకర్, బీర్పూర్ ఎస్సై కుమారస్వామి, ఎస్ ఐ రాజు ల ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ అధికారులు ఈవో శ్రీనివాస్ ,ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ , రేనోవేషన్ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో తగు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీర్పూర్ మండలం మాజీ ప్రజాప్రతినిధులు సింగిల్ విండో చైర్మన్ ముప్పాల రామచంద్రరావు, సర్పంచుల మండలపోరం అధ్యక్షుడు రాజగోపాల్ రావు, బీర్పూర్ గ్రామ సర్పంచ్ హరీష్, ఉపసర్పంచ్ జితేందర్, మాజీ జెడ్పిటిసి రమణ, మాజీ ఎంపీపీ రమేష్, సర్పంచుల ,ఆయా గ్రామాల సర్పంచులు సుశీల్ స్రృజన, రంగు లక్ష్మణ్, పూదూరి రాజకుమార్ శ్రీలత, శ్రీపతి స్వాతి రమేష్, తొడ సం గంగవ్వ ఇస్రు, కోనపల్లి శేఖర్, చల్ల లక్ష్మణ్ వినోద, చిక్రం మారుతి, తోట శ్రీనివాస్, బనక సతీష్, పురుక రామచంద్రం దీపకల్పన, తోగిటి సత్తవ్వ, బోడ సాగర్, మసీద్ తిరుపతి, నరసయ్య , బిజెపి బీర్పూర్ మండల అధ్యక్షుడు ఆడెపు నరసయ్య, మరియు వివిధ గ్రామాల ప్రజలు మాజీ ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డప్పు చప్పుళ్లు....ర్యాలీలు

- చివరి రోజున పెద్ద ఎత్తున నామినేషన్లు
- సిరిసిల్లలో నెలకొన్న రాజకీయ సందడి
- ప్రశాంతంగా ముగిసిన నామినేషన్ల పర్వం
- 36 వార్డులకు అభ్యర్థులను ప్రకటించిన బిఆర్ఎస్

సిరిసిల్ల బ్యూరో, ప్రభాతవార్త :

డప్పు చప్పుళ్లు...ర్యాలీలు...హోరెత్తగా పోటా పోటీగా అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేశారు. ఆయా పార్టీలకు చెందిన అభ్యర్థులు తమ తమ వార్డుల నుంచి ఊరేగింపుగా భయలు దేరి మున్సిపల్ కార్యాలయం వరకు వచ్చి నామినేషన్‌లను వేశారు. చివరి రోజైన శుక్రవారం సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 39 వార్డులలో పోటీ చేస్తున్న అభ్యర్థులు నామినేషన్లు అధికారులకు అందించారు. గత రెండు రోజులుగా నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుండగా చివరి రోజు మాత్రం పెద్ద ఎత్తున స్వతంత్ర అభ్యర్థులు, బిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి పార్టీలకు చెందిన అభ్యర్థులు పార్టీల కండువాలు, జెండాలతో తమ అనుచరులతో కలిసి వచ్చి నామినేషన్లను వేశారు. ఇప్పటికే బిఆర్ఎస్ పార్టీ నుంచి ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల జాబితాను గత మూడు రోజులుగా విడతల వారిగా ప్రకటించారు. మున్సిపల్ పరిధిలోని 36 వార్డుల నుంచి పోటీ చేస్తున్న బిఆర్ఎస్ అభ్యర్థుల జాబితాను మున్సిపల్ ఇంచార్జి తుల ఉమ ప్రకటించారు. మరో మూడు వార్డుల అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. అధికార కాంగ్రెస్, బిజెపి పార్టీలు మాత్రం ఇప్పటి వరకు తమ అభ్యర్థులను ప్రకటించడంలో వెనుకంజనే ఉన్నాయి. బిఆర్ఎస్ పార్టీ నుంచి కౌన్సిలర్‌లుగా పోటీ చేయడానికి అధిక సంఖ్యలో అభ్యర్థులు ఉండడంతో ఈ సారి స్థానిక ఎమ్మెల్యే కెటిఆర్ ప్రత్యేక శ్రద్ధ పెట్టి అభ్యర్థులను ఖరారు చేశారు. పోటీ అధిక సంఖ్యలో ఉన్న నాయకులను పిలిచి ఒక రోజంత మాట్లాడి ఒప్పించారు. కాంగ్రెస్, బిజెపిలు మాత్రం బిఆర్ఎస టికెట్ ఆశించి రాని అభ్యర్థులను టికెట్లు ఇవ్వాలని చూస్తున్నట్లు తెలుస్తుంది. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికి అన్ని వార్డులకు సరైన అభ్యర్థులు లేకపోవడంతో వేచిచూసే ధోరణి కనబరుస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే కాంగ్రెస్ పార్టీలో రెండు వర్గాలు ఉండడం కూడ తీవ్ర నష్టం జరుగుతుందని ఆ పార్టీ నేతలు బహిరంగంగానే పెర్కొంటున్నారు. బిజెపి పార్టీ నుంచి కూడ అన్ని వార్డులకు సంబందించి అభ్యర్థులు కనిపించడం లేదు. ఎట్టకేలకు నామినేషన్ల ప్రక్రియ చివరి రోజు కావడంతో సిరిసిల్లలో సందడి నెలకొంది. మున్సిపల్ ఏరియాలో ఎక్కడ చూసిన నాయకులు, కార్యకర్తలు కనిపించారు. మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. సిరిసిల్ల పట్టణ సిఐ కృష్ణ ఆద్వర్యంలో పటిష్ట బందోబస్తును








ఏర్పాటు చేశారు. ప్రశాంతంగా నామినేషన్ల దాఖలు కార్యక్రమం ముగిసింది. నామినేషన్ల పరిశీలన తరువాత ఉపసంహరణ ఉంటుంది. వార్డుల్లో నామినేషన్లు దాఖలు చేసి అభ్యర్థులను ఉపసంహరించుకునేందుకు ఆయా పార్టీల నేతలు కసరత్తులు జరుపుతున్నారు. టికెట్లు పక్కా అయిన అభ్యర్థులు తమ వార్డుల్లో ప్రచారం మొదలు పెట్టారు.

## గోదావరి పుష్కరాల ఏర్పాట్లకు
# ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

మంథని ప్రభాతవార్త:



గోదావరి పుష్కరాల ఏర్పాట్లకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మంథనిలోని ఆర్డిఓ కార్యాలయంలో 2027 గోదావరి నది పుష్కరాల ఏర్పాట్ల పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ 2027 జూన్ 26 నుంచి 2027 జూలై 7 వరకు గోదావరి నదికి 12 సంవత్సరాలకు ఒకసారి వచ్చే మహా పుష్కరాలు జరుగుతాయని, దీనికి సంబంధించి మన జిల్లాలో భక్తులు పుణ్యస్నానాలు చేసేందుకు అవసరమైన ఘాట్ నిర్మాణం, రోడ్డు విస్తరణ, లైటింగ్, ఇతర ఏర్పాట్లు, ఆలయాల అభివృద్ధి కు ప్రతిపాదనలు తయారు చేసి వీలైనంత త్వరగా సమర్పించాలని కలెక్టర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మంథని రెవెన్యూ డివిజన్ అధికారి సురేష్, ఈఈ ఆర్ అండ్ బి భావ్ సింగ్, ఈఈ మిషన్ భగీరథ ఇంట్రా శ్రీనివాస్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వన దేవతలను దర్శించుకున్న ఎమ్మెల్యే

- ఇచ్చిన మాట మేరకు సమ్మక్క సారలమ్మకు తారు రోడ్లు..
- వచ్చేనాటికి మరింత సౌకర్యం కల్పిస్తా.
- ఎమ్మెల్యే విజయరమణ రావు

ఓదెల, ప్రభాతవార్త .:

ఓదెల మండలం, కొలనూరు గ్రామంలో గురువారం రోజున సమ్మక్క,





సారలమ్మల జాతర మహోత్సవం సందర్భంగా గద్దెల పై కొలువుతీరిన వనదేవతలకు మొక్కులను చెల్లించుకున్న అనంతరం స్థానిక నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించిన పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణా రావు అనంతరం అక్కడే కొలువై ఉన్న గోవిందరాజు, పడిగిద్ద రాజును ఎమ్మెల్యే విజయరమణ రావు దర్శించుకొని మొక్కలు చెల్లించుకున్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ. ఓదెల మండలం కొలనూరు గ్రామంలో ఇచ్చిన హామీ మేరకు రూ. 95 లక్షలతో సమ్మక్క సారలమ్మ జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం నూతనంగా తారు రోడ్డు నిర్మాణం పూర్తి చేయడం జరిగిందన్నారు ఇచ్చిన మాట నెరవేర్చడమే తప్పా మాట తప్పేది లేదని స్పష్టం చేశారు. సమ్మక్క సారలమ్మ జాతరకు విచ్చేసే భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా జాతర కమిటీ వారు మెరుగైన సౌకర్యాలు కల్పించరాని అన్నారు ఈ కార్యక్రమంలోపే ఏఎంసీ మాజీ చైర్మన్ గుండేటి ఐలయ్య యాదవ్ సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షులు పిట్టల రవికుమార్ సింగిల్ విండో మాజీ చైర్మన్ గోపు నారాయణరెడ్డి కమిటీ చైర్మన్ కొలిపాక మదనయ్య స్థానిక సర్పంచ్ పల్లె కనకయ్య కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బైరవి తో పాటు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మూల ప్రేమ్ సాగర్ రెడ్డి వివిధ గ్రామాల సర్పంచులు ప్రజా ప్రతినిధులు నాయకులు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఎటు తేలని బీ-ఫారాల పంచాయితీ

**'నో టికెట్' గ్యారంటీతో రాజకీయ దందా?**

**ఒక్కో డివిజన్‌లో పదుల సంఖ్యలో ఆశావహులు పోటీ**

**ఓ జాతీయ పార్టీలో టికెట్‌కు లక్షల లెక్కలు?**

**రామగుండం కార్పొరేషన్‌లో జంభలకిడి పంబ..!**

గోదావరిఖని ,ప్రభాతవార్త:

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాజకీయ వాతావరణం రోజురోజుకీ వేడెక్కుతోంది. అయితే అభివృద్ధి, ప్రజా సమస్యలపై చర్చ కంటే.. టికెట్ల పంపిణీ, బీ-ఫారాల వ్యవహారమే ప్రధాన అంశంగా మారింది. ఎటు తేలని బీ-ఫారాల పంచాయితీతో పార్టీల్లో అయోమయం నెలకొనగా, ఆశావహుల్లో అసహనం పెరుగుతోంది.ప్రతి డివిజన్‌లో ఒక్కో పార్టీ నుంచి పదుల సంఖ్యలో ఆశావహులు పోటీకి సిద్ధమయ్యారు. నాయకత్వం తమకే టికెట్ ఇస్తుందన్న ఆశతో నెలల తరబడి ప్రచారం చేసిన వారు, చివరి నిమిషంలో పరిస్థితి మారిపోతుందేమోనన్న ఆందోళనతో గడుపుతున్నారు. పార్టీ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ, కీలక నేతలను కలుస్తూ చివరి ప్రయత్నాలు సాగిస్తున్నారు.బీ-ఫారాల పంపిణీపై స్పష్టత లేకపోవడంతో 'టికెట్ గ్యారంటీ' అంటూ మధ్యవర్తులు రంగంలోకి దిగారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. టికెట్ ఇప్పిస్తామంటూ హామీలు ఇచ్చి, చివరకు 'నో టికెట్' గ్యారంటీగా మారుతోందని పలువురు ఆశావహులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డబ్బులు చేతులు మారినా, చివరికి పార్టీ టికెట్ దక్కకపోవడం ఇప్పుడు ప్రధాన చర్చాంశంగా మారింది.ముఖ్యంగా ఒక జాతీయ పార్టీలో టికెట్ కావాలంటే మూడు లక్షల రూపాయల వరకూ ఖర్చవుతుందన్న ప్రచారం రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. అధికారికంగా పార్టీ నేతలు ఈ ఆరోపణలను ఖండిస్తున్నప్పటికీ, లోపాయికారీ వ్యవహారాలు జరుగుతున్నాయన్న అనుమానాలు మాత్రం తీరడం లేదు. డబ్బులే అర్హతగా మారాయా? ప్రజాసేవ, పార్టీ నిబద్ధతకు విలువ లేదా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.టికెట్ దక్కకపోతే స్వతంత్రంగా పోటీ చేస్తామంటూ కొందరు ఇప్పటికే బాహాటంగానే ప్రకటిస్తున్నారు. మరోవైపు, చివరి క్షణంలో పార్టీ పెద్దలు రంగంలోకి దిగి సమీకరణలు మార్చేస్తారన్న అంచనాలు కూడా ఉన్నాయి. దీంతో ఆశావహులు తుది జాబితా వెలువడే వరకూ ఎదురు చూపులు చూస్తున్నారు.ఈ అయోమయం కారణంగా పార్టీల్లో అంతర్గత విభేదాలు తలెత్తుతున్నాయి. ఒకే డివిజన్‌లో పలువురు సీనియర్ నాయకులు టికెట్ కోసం పోటీ పడటం, ఎవరి వెనుక ఎవరు లాబీయింగ్ చేస్తున్నారన్నది బహిరంగ రహస్యంగా మారింది. ఈ పరిస్థితి ఎన్నికల ప్రచారంపై కూడా ప్రభావం చూపుతోందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.ప్రజా సమస్యలపై స్పష్టమైన ప్రణాళికలతో ముందుకు రావాల్సి న సమయంలో, టికెట్ల చుట్టూ తిరిగే రాజకీయాలు ప్రజల్లో నిరాశ కలిగిస్తున్నాయి. అభ్యర్థుల ఎంపికలో పారదర్శకత లేకపోతే, ఎన్నికల తర్వాత కూడా ఇదే అసంతృప్తి కొనసాగుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.మొత్తానికి రామగుండం కార్పొరేషన్ ఎన్నికల్లో బీ-ఫారాల వ్యవహారం 'జంభలకిడి పంబ'గా మారింది. చివరి నిమిషంలో ఈ గందరగోళానికి తెరపడుతుందా? లేక టికెట్ రాజకీయాలు మరింత ముదిరుతాయా? అన్నది ఇప్పుడు సర్వత్రా ఆసక్తికరంగా మారింది. ఎన్నికల గంట మోగేలోపు పార్టీల నిర్ణయాలే ఈ రాజకీయ గందరగోళానికి ముగింపు పలకనున్నాయి.

# నేల ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం

గీసుగొండ ప్రభాతవార్త .



పాఠశాల నేల ఆరోగ్య కార్యక్రమం" (స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రామ్)లో భాగంగా భారత ప్రభుత్వం 202526 విద్యా సంవత్సరంలో దేశవ్యాప్తంగా 5000 పాఠశాలల్లో ఈ కార్యక్రమం అమలు చేస్తుందని మండల వ్యవసాయ అధికారి పి. హరి ప్రసాద్ బాబు పేర్కొన్నారు. దీనిని వ్యవసాయ , రైతుల సంక్షేమ శాఖ , పాఠశాల విద్య , అక్షరాస్యత విభాగం సహకారంతో నిర్వహిస్తోందని, స్థిరమైన వ్యవసాయ పద్ధతులు , భూమి సంరక్షణ కోసం 'నేల ఆరోగ్యం' యొక్క ప్రాముఖ్యతపై విద్యార్థులలో అవగాహన కల్పించడమే ఈ ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యం అని వ్యవసాయ అధికారులు అన్నారు.తెలంగాణ రాష్ట్రంలో 202526 సం: గాను 292 పాఠశాలల లక్ష్యాన్ని కేటాయించగా ఈ స్కీం క్రింద వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని వంచనగిరి (మోడల్ స్కూల్ )ఎంపికైందని ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి తరఫున పాల్గొన్న మండల వ్యవసాయ అధికారి అన్నారు. 50 మంది విద్యార్థులను (5 బ్యాచ్‌లు, ఎస్ హెచ్ సి పోర్టల్‌లో నమోదు చెయ్యాలని ఇందుకు 7, 8, 9, 11వ తరగతి విద్యార్థులను మాత్రమే ఎంపిక చెయ్యాలని, పాఠశాల సైన్స్ టీచర్ ఇన్‌ఛార్జ్‌గా ఉండి మొబైల్‌లో ఖిసాయిల్ హెల్త్ కార్డుఖి యాప్‌ను డౌన్‌లోడ్ చేసి పాఠశాల సమీపంలోని రైతు పొలాల నుండి మట్టి నమూనాలను విద్యార్థులు సేకరించేలా చేసి మట్టి పరీక్ష , ఎరువుల సిఫార్సు కిట్‌ను ఉపయోగించి ఫలితాలను పోర్టల్‌లో నమోదుచేసే విధంగా చూడాలన్నారు. పోర్టల్ ద్వారా మట్టి నాణ్యతను బట్టి 6 రకాల పంటలకు అవసరమైన ఎరువుల సిఫార్సులతో కూడినకార్డుతయారవుతుంది. విద్యార్థులు రైతులకు ఖిమట్టి ఆరోగ్య కార్డుఖిను దానికి సంబంధించిన సలహాలను అంద చేస్తారు .అంతటితో ఈ కార్యక్రమం పూర్తి అవుతుందన్నారు. అనంతరం కె.వి.కెమామూనూరు శాస్త్రవేత్త ఆర్. హర్ష వర్ధన్ రెడ్డి విద్యార్థులకు మట్టి నమూనాల సేకరణ ఎలా చేయాలో ప్రాక్టికల్ గా పాఠశాల ఆవరణలో చూపించడం జరిగింది. స్కూల్ క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి ప్రియాంక కిట్ ఉపయోగించి మట్టి శాంపుల్స్ విశ్లేశించి ఫలితాలు ఎలా రికార్డు చెయ్యాలో వివరించడం జరిగింది.ఈ అవగాహన కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీమతి తీ. సునీత, సైన్స్ టీచర్ తీ. సుకధా 50 మంది విద్యార్థులు పాల్గొన్నారని గీసుగొండ మండల వ్యవసాయ అధికారి ఈ హరి ప్రసాద్ బాబు తెలిపారు.

# మహిళా కానిస్టేబుల్ అనితకు నివాళులర్పించిన ఎమ్మెల్యే నాగరాజు

పర్వతగిరి, జనవరి 30, ప్రభాతవార్త



వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఏఆర్ విభాగంలో విధులు నిర్వహిస్తూ, వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం సీత్యతండా కు చెందిన మహిళా కానిస్టేబుల్ రామావత్ అనిత ఆత్మహత్య చేసుకొని మరణించగా శుక్రవారం వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు వారి నివాసానికి వెళ్లి ఆమె భౌతిక దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి, ఈ విషాద ఘటన పట్ల ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ దుఃఖ సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్, జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్ రావు, స్థానిక సర్పంచ్ నరేష్, మాజీ సర్పంచ్ హేమ్లా నాయక్, సర్పంచ్లు చిటూరి శంకర్, గాడిపెల్లి మహేందర్ తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కుటుంబ సభ్యులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# నామినేషన్ కేంద్రాల పరిశీలన

వర్ధన్నపేట/వరంగల్ జనవరి 30 ప్రభాతవార్త



మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల చివరి రోజు శుక్రవారం వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పరిశీలించారు. నామినేషన్ ప్రక్రియ సజావుగా సాగుతున్న తీరును గమనించిన కలెక్టర్, అభ్యర్థులు వారి ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.నామినేషన్ కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్లు, క్యూలైన్ల నిర్వహణ, దరఖాస్తుల స్వీకరణ కౌంటర్ల పనితీరును పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. ఎన్నికల ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా, పారదర్శకంగా నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ సందర్శనలో జిల్లా కలెక్టర్ వెంట అదరపు కలెక్టర్ జి సంధ్యారాణి, వరంగల్ ఆర్డీవో సుమ, వర్ధన్నపేట తాసిల్దార్ విజయ సాగర్, వర్ధన్నపేట స్పెషల్ ఆఫీసర్ రమేష్ తదితరులు ఉన్నారు.

# ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

**జగిత్యాల జిల్లా మున్సిపాలిటిల్లో భారీగా నామినేషన్లు**

**కార్యకర్తల కోలాహలం మధ్య అభ్యర్థుల నామినేషన్ల దాఖలు**

**ర్యాలీలో డప్పు సపోర్ట తో నామినేషన్ కేంద్రాల వద్దకు రాక**

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:



భారీ ర్యాలీలు డబ్బు చప్పుల మధ్య చివరి రోజు నామినేషన్ల పర్వముగిసిందిజగిత్యాల జిల్లాలోని 5 జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల, మెట్పల్లి, రాయికల్ మున్సిపాలిటిల్లో శుక్రవారం నామినేషన్ల చివరిరోజు పెద్ద సంఖ్యలో కౌన్సిలర్ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు.కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్. పార్టీలు, స్వతంత్రులు ఒక్కో వార్డు ఎక్కువ మంది ఆశావాహులు టిక్కెట్ కోసం తీవ్ర పోటీనెలకొనగా నాయకులు సమయమనం పాటిస్తూ కార్యకర్తలను బుజ్జగించే పనుల్లో తలమూనకలై ఉన్నారు.జగిత్యాల మున్సిపల్ లో పరిస్థితి మరోలా ఉన్నది.ఎమ్మెల్యే, సంజయ్ కుమార్ మాజీ మంత్రి మధ్య పచ్చగడ్డి వేస్తే బగ్గుమానేలా ఉండగ ఇక్కడ ఎవరికీ పార్టీ బీ ఫారాలు అధిష్టానం ఇస్తుందోనని ఆశవాహుల్లో తీవ్ర ఉత్కంట నెలకొన్నప్పటికీ పోటా పోటీగా అభ్యర్థులు నామినేషన్లు వేశారు.జగిత్యాల పట్టణంలోని 22 వార్డు నుండి కాంగ్రెస్ అభ్యర్తిగా చిట్ల అంజన్న,చిట్ల లతలు కాంగ్రెస్ పార్టీ అభిమానులు వెంటారాగా నామినేషన్లు దాఖలు చేశారు. జగిత్యాల మున్సిపల్ 48 వ వార్డు బిజెపి అభ్యర్థి గా కొండా అరుణ లక్ష్మణ్ లు పెద్ద ఎత్తున వార్డ్ ప్రజలు వెంటారాగ నామినేషన్ దాఖలు చేశారు.అరుణ ఇంటి నుండి ర్యాలీ గా బయలుదేరి టవర్ సర్కిల్ మీదుగా తహసిల్ చౌరస్తా , ఓల్డ్ బస్టాండ్ నుండి నామినేషన్ కేంద్రమైన మెప్మా కార్యాలయంలో కార్యకర్తల ఆనందోత్సాహాల మధ్య నామినేషన్ పత్రాలు అధికారులకు అందజేశారు. 26 వార్డు నుండి కాంగ్రెస్ అభ్యర్తిగా సిరిపురం ఉషశ్రీ జితేందర్,ఇంకా వివిధ వార్డుల నుండి జంగిలి ఓంకార్, బద్ధం లత జగన్మోహన్ రెడ్డి, పద్మ, మున్నా, డబ్బు అఖిల రెడ్డి, పిప్పరి అనిత, బొల్లి శేఖర్,శివకేసరి బాబు, అల్లాల రమేష్ రావు, చెట్టే గంగాధర్, ధర్మేందర్, సమిండ్ల వాణి, కొక్కు గంగాధర్, తదితరులు నాయకులు, కార్యకర్తలు వెంటారాగా అభ్యర్థులు నామినేషన్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు అందజేశారు.